ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 06.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 345 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

టీ20 వరల్డ్ కప్... ఫైనల్ చేరిన భారత్ 10

భారీ సంఖ్యలో జనం వచ్చే అవకాశం

ఖమేనీ అంత్యక్రియలు వాయిదా

- మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలి
- తేదీలను త్వరలో వెల్లడిస్తాం: ఇరాన్
- ఖమేనీ మృతిపై భారత్ సంతాపం
- పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు
- అజర్‌బైజాన్‌లో ఇరాన్ డ్రోన్ దాడులు
- పర్షియన్ గల్ఫ్‌లోని అమెరికా ట్యాంకర్‌పై దాడి
- అమెరికా ఖండాంతర అణు క్షిపణి పరీక్ష
- ట్రంప్ చర్యకు అమెరికా సెనెట్ ఆమోదం
- హోర్ముజ్ జలసంధి.. అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపాలకే అనుమతి లేదు
- భారర్‌కు లభించిన ఊరట

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

అమెరికా ఇజ్రాయెల్ దళాలు దేశవ్యాప్తంగా తీవ్ర దాడులను కొనసాగిస్తున్నందున ఇరాన్ అధికారులు దివంగత సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాన్ని వాయిదా వేశారు. టెహ్రాన్ ప్రార్థనా సముదాయంలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో జనం వచ్చే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఇస్లామిక్ డెవలప్ మెంట్ కోఆర్డినేషన్ కౌన్సిల్ అధినేత మోహిసిన ఇరాన్ ప్రభుత్వ మీడియాకు

...:: మిగతా 2లో

భారత్‌కు ఊరట

గురువారం ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హోర్ముజ్ జలసంధి గుండా అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలకు మాత్రమే అనుమతి ఉండబోదని వెల్లడించింది. ఈ క్రమంలో భారత్‌కు కొంత ఊరట లభించినట్టేనని విశ్లేషకులు చెప్తున్నారు. దేశంలో ప్రస్తుతం 50 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయని, కాబట్టి పెట్రోల్, డీజిల్ నిల్వలపై ఆందోళన అవసరం లేదని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. చమురు సంక్షోభం ముంచుకొస్తే రష్యా తదితర దేశాల నుంచి దిగుమతులపై యోచిస్తామని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో భారత జెండాలున్న 37 నౌకలు నిలిచిపోయాయి.

రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ సింఘ్వీ, నరేందర్ రెడ్డి

ముగిసిన రాజ్యసభ నామినేషన్ ప్రక్రియ

పాల్గొన్న సీఎం రేవంత్.. ఇద్దరి ఎన్నిక ఏకగ్రీవమే

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 5: రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ సింఘ్వీ, నరేందర్ రెడ్డిల ఎన్నిక ఇక లాంఛనమే. రాష్ట్రంలో ఇద్దరు రాజ్యసభ సభ్యుల ఎంపికకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని ఎన్నికల అధికారి వద్ద కాంగ్రెస్ పార్టీ తరపున తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు నామినేషన్ పత్రాలు సమర్పించారు. సింఘ్వీ మూడు సెట్‌ల నామినేషన్లు దాఖలు చేయగా, వేం నరేందర్ రెడ్డి నాలుగు సెట్‌లు, ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి, ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఎన్నిక ఏకగ్రీవం

దాంతో అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ అభ్యర్థులు నిలవనున్నారు. వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బరిలో నిలపలేదు. దీంతో వీరిద్దరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. గతంలో తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళ్లిన అభిషేక్ మను సింఘ్వీ పదవి కాలం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. కాగా 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఈ నామినేషన్లను ఎన్నికల అధికారి పరిశీలించనున్నారు. ఎమ్మెల్యేల సంతకాలు లేని ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించనున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.29 (శుక్రవారం సాయంత్రం)

సహర్ – 5.08 (శనివారం ఉదయం)

యుద్ధాలకు ముగింపు పలకాలి: మోదీ

ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

9

మన పొరుగున ఉద్రిక్తతలు అయినా మౌనమెందుకు?

పశ్చిమాసియా సైనిక ఘర్షణ చివరకు భారత్ పొరుగుదేశం దాకా చేరుకుందని, అయినా ప్రధాని మోదీ మౌనంగా ఉండటాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ట్వీట్ చేశారు.

9

తెలంగాణ ఫస్ట్ అజెండాతో కొత్త పార్టీ

ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి కోసం ఏర్పాటు

- రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ విఫలం
- తెలంగాణ హక్కుల కోసం పోరాటం
- ప్రజలు ప్రత్యామ్నాయం కోరుతున్నారు
- ప్రజల సమస్యలపై మైక్రో లెవల్ పోరాటం
- తిరుమలలో జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, తిరుపతి, మార్చి 5: తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు సేవ చేసే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. బీఆర్ఎస్, బీజేపీ

...:: మిగతా 2లో

ముగిసిన కడియం విచారణ

- దానం నాగేందర్ విచారణ వాయిదా

...:: 3లో

ఒక్క ఇల్లు కూల్చనిది బీఆర్ఎస్ మోడల్

లక్షన్నర ఇండ్లు కూల్చే బుల్డోజర్ మోడల్ కాంగ్రెస్ ది

- 'ఇందిరమ్మ రాజ్యం' తెస్తామని చెప్పి బుల్డోజర్ రాజ్యాన్ని' తెచ్చారు
- కాంగ్రెస్ మూసి ప్రాజెక్టు కోసం బుల్డోజర్ మోడల్ ఎంచుకున్నది
- విధ్వంసం అరాచకం లేకుండా మూసిని అభివృద్ధి చేయవచ్చు
- లక్షన్నర పేదల ఇండ్లు కూల్చి మూసి అభివృద్ధి చేస్తామంటే ఒప్పుకోము
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 5: ఎలాంటి విధ్వంసం లేకుండా అరాచకం లేకుండా మూసిని అభివృద్ధి చేయవచ్చు అని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మూసి అభివృద్ధి అంశంలో ఒక్క ఇల్లు కూల్చే అవసరం లేనిది బీఆర్ఎస్ మోడల్ అయితే.. లక్షన్నర ఇండ్లను కూల్చే బుల్డోజర్ మోడల్ కాంగ్రెస్ ది అని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ మోడల్లో వికాసం ఉంటే కాంగ్రెస్ విధానాల్లో విధ్వంసం ఉన్నదని కేటీఆర్ అన్నారు. మూసి

...:: మిగతా 2లో

కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో

దురుద్దేశం లేదు

- ఎవరినో టార్గెట్ చేసేందుకు ఏర్పాటు చేయలేదు
- హైకోర్టుకు స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి
- తదుపరి కేసు విచారణ 12కు వాయిదా

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 5: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ ఏర్పాటు వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి హైకోర్టుకు స్పష్టం చేశారు. ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైందని తెలిపారు. ఎవరినో టార్గెట్ చేసేందుకు జస్టిస్ పీసీ. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేయలేదని హైకోర్టు దృష్టికి

...:: మిగతా 2లో

తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా

- పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు
- నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు
- మహారాష్ట్రకు జిష్ణు దేవ్ వర్మ బదిలీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 5: తెలంగాణ కొత్త గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హిమాచల్ గవర్నర్‌గా పనిచేస్తున్న శివ ప్రతాప్ శుక్లాను తెలంగాణకు బదిలీ చేశారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్రకు ట్రాన్స్‌ఫర్ చేశారు. జిష్ణుదేవ్ వర్మను రాష్ట్రపతి ముర్ము 2024 జూలై 27న తెలంగాణ గవర్నర్‌గా నియమించారు. సుమారు 19 నెలల పాటు తెలంగాణ గవర్నర్‌గా ఆయన వ్యవహరించారు. ఉత్తరప్రదేశ్‌కు

...:: మిగతా 2లో

రాజ్యసభకు నితీశ్ కుమార్ నామినేషన్

బిహార్ సీఎంగా సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్ ఇక పెద్దల సభకు వెళ్లనున్నారు. ఈ మేరకు రాజ్యసభ అభ్యర్థిగా గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు.

9

రాష్ట్రీయం

ఒక్క ఇల్లు కూల్చనిది బీఆర్‌ఎస్ మోడల్

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి పేరిట కాంగ్రెస్ చేస్తున్న అరాచకాన్ని అవినీతిని ఆపాలని, తమ అవినీతి సొమ్ముల కోసం లక్షల మంది పేదల ఇండ్లు పూలగొట్టే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ బుల్డోజర్ మోడల్ పరిపాలన ఆపాలని కేటీఆర్ హెచ్చరించారు. మూసి ప్రాజెక్టు అభివృద్ధి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో మూసీ ప్రాజెక్టు పేరిట లక్షన్నర మంది ఇళ్లను కూలగొట్టే కుట్ర చేస్తున్న రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ మండిపడ్డారు. కేవలం తన అవినీతి కోసం, ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల సంపాదన కోసం లక్షన్నర మంది పేదల ఇళ్లను కూలగొడతామంటే ఊరుకోమని, హైదరాబాద్‌లోని ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, కేసీఆర్ సైనికుడు కాంగ్రెస్ పార్టీ బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతారని కేటీఆర్ అన్నారు. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం విధ్వంసం లేకుండా కూడా మూసీని అభివృద్ధి చేసే అవకాశం ఉన్నదని, గతంలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఐదున్నర కిలోమీటర్ల మేర ఒక్క వ్యక్తికి ఇబ్బంది లేకుండా మూసీని నాగోల్ ప్రాంతంలో అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వానికి ఇదే మాట చెప్పడానికి ఈరోజు మూసీలో అభివృద్ధి చేసిన ప్రాంతాన్ని కేటీఆర్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, సీనియర్ నేతలతో కలిసి పర్యటించారు. అక్కడ మూసీ ప్రాజెక్టు బాధిత కుటుంబాలతో మాట్లాడారు. తీవ్రమైన ఆవేదనలో, ఆందోళనలో ఉన్న వారిని కేటీఆర్ ఓదార్చారు, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి చేస్తున్నది 'మూసీ బ్యూటిఫికేషన్' కాదు అని, అది 'లూటిఫికేషన్' అన్నారు. కేవలం 16 వేల కోట్ల రూపాయలతో మొత్తం మురుగు నీటిని శుద్ధి చేయడంతో పాటు కొండపోచమ్మ నుంచి మంచి నీళ్లను మూసీలోకి తీసుకురావడం, రెండు వైపులా స్కైవేల నిర్మాణం వంటి అన్ని కార్యక్రమాలతో కూడిన సమగ్రమైన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నదని, కానీ కేవలం వేల కోట్ల రూపాయల అవినీతి కోసం రేవంత్ రెడ్డి ఈ మూసీ ప్రాజెక్టును ఎత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. 16 వేల కోట్లతో జరిగే ప్రాజెక్టుని లక్షన్నర కోట్ల రూపాయల ఖర్చు పెట్టడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. పేద ప్రజల ఇళ్లను కూలగొట్టి లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ తన అవినీతికి వాడుకుంటామంటే ఖచ్చితంగా అడ్డుకొని తీరుతామన్నారు. ముందుగా నాగోల్ లో ఉన్న ఎస్టీపిని విజిట్ చేసిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు పార్టీ సీనియర్ నేతలు, తర్వాత నాగోల్ బ్రిడ్జి వద్ద గత ప్రభుత్వం అభివృద్ధి చేసిన మూసి మోడల్ ని పరిశీలించి అక్కడ ఉన్న బాధితులతో మాట్లాడారు. కేటీఆర్ పాటుగా మాజీ మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుదీర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్ ఎమ్మెల్సీ వాణి దేవి ఉన్నారు.

హైదరాబాద్ – నాగోల్ ఎస్టీపీ ప్లాంట్‌ను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్‌లో నాగోల్‌లో ఉన్న ఎస్టీపీ ప్లాంట్ ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి రామారావు కేటీఆర్) గురువారం పరిశీలించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి , మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, వివేకానంద గౌడ్, ముఠా గోపాల్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, వాణీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి ముసి రివర్ సుందరీకరణకు వ్యతిరేకత లేదని, కానీ మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మూసీ శుద్ధి కోసం మొదటి దశలో 35 ఎస్టీపీ ప్లాంట్లను నిర్మించామని ఆయన పేర్కొన్నారు. ఎస్ టిపిప్లాంట్ల ద్వారా మూసీ నది నీటిని శుద్ధి చేయవచ్చని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూసీ సుందరీకరణ పేరుతో ఇళ్లను కూల్చివేయడానికి సిద్ధమవుతోందని ఆయన ఆరోపించారు. దీంతో దాదాపు 11 వేల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని అన్నారు.

కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో దురుద్దేశం లేదు

మొదటిపేజీ తరువాయి

తీసుకు వెళ్లారు. గురువారం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు, కమిషన్‌అందించిన నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఏజీ, పిటిషనర్ తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం నిర్మాణంలో అధికార దుర్వినియోగం జరిగిందని హైకోర్టుకు ఏజీ వెల్లడించారు. ఇక పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. పలువురిపై కమిషన్ తప్పుడు అభియోగాలు నమోదు చేసిందన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో బిజినెస్ రూల్స్ ఎక్కడా ఉల్లంఘించ లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినట్లు పిటిషనర్ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్‌ను సాక్షిగా పిలిచి దోషిగా ఆరోపణలు చేయడం సరికాదంటూ న్యాయవాది తన వాదనలు వినిపించారు. తప్పుడు విధానంలో కమిషన్ నోటీసులు ఇచ్చిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ స్థల మార్పిడి, ప్రాజెక్టు ఖర్చు అంచనాతోపాటు నిర్మాణ సంస్థలకు ఇవ్వడంలో ఎవరు లబ్ధి పొందలేదన్నారు. ఈ కాళేశ్వరం కమిషన్ నివేదిక చెల్లదని, దీనిపై స్టే ఇవ్వాలని హైకోర్టును పిటిషనర్ న్యాయవాది కోరారు. ఈ వాదనలు విన్న హైకోర్టు.. తదుపరి విచారణ మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా

మొదటిపేజీ తరువాయి

చెందిన శివ ప్రతాప్ శుక్లా 1989లో తొలిసారి ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత వరుసగా 1991, 93, 96లో ఎమ్మెల్యేగా గెలిచారు. 1996 నుంచి 1998 వరకు సీఎంలు మాయావతి, కల్యాణ్ సింగ్ నేతృత్వంలో ఉత్తరప్రదేశ్ జైళ్ల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. తదనంతర కాలంలో ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికై మోదీ తొలి క్యాబినెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023 ఫిబ్రవరి 19న హిమాచల్ ప్రదేశ్ 22వ గవర్నర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి మూడేండ్లు ఆ రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించారు.

బెంగాల్ గవర్నర్ బోస్ రాజీనామా

అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నెల రోజులు ఉండగా బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. దీంతో బెంగాల్ గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కేంద్రం నియమించింది. కేరళ గవర్నర్ అర్లేకర్ తమిళనాడు గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాను లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించారు. అక్కడ ఉన్న కవీందర్ గుప్తాను హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బదిలీ చేశారు. నంద కిషోర్ యాదవ్‌ను నాగాలాండ్ గవర్నర్‌గా, తరణ్ జీత్ సింగ్ సంధును ఢిల్లీ ఎల్జీగా, లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అట హస్నైన్ (రిటైర్డ్)ను బీహార్ గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు.

రాజకీయ ఒత్తిడితోనే: బెంగాల్ సీఎం మమత

గవర్నర్ సీవీ ఆనంద బోస్ హఠాత్తుగా రాజీనామా చేయడం తనను విస్మయానికి గురిచేసినట్లు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. హఠాత్తుగా గవర్నర్ రాజీనామా చేయడానికి దారితీసిన పరిస్థితేమిటో తనకు తెలియవని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయనపై రాజకీయ ఒత్తిడి పెట్టి రాజీనామా చేయించినా ఆశ్చర్యం లేదని ఆమె వ్యాఖ్యానించారు. 'అవును. నేను రాజీనామా చేశాను. గవర్నర్‌గా మూడున్నరేండ్లు పనిచేశా. అది చాలు నాకు' అని పీటీఐ వార్తాసంస్థతో బోస్ పేర్కొన్నారు.

99 రోజుల ప్రణాళికతో పట్టణాభివృద్ధికి కృషి

- మున్సిపల్‌కమిషనర్ టి.మల్లికార్జున్

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘ కమిషనర్ టి.మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రణాళిక విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో అధికారుల బాధ్యత ఎంతో ఉందని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆయన సూచించారు. వార్డు అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించే దిశగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమ అమలులో నిర్లక్ష్యం వహించకూడదని, లక్ష్యాలను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇన్చార్జి మేనేజర్ సంపత్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారి రోహిత్, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, మెప్మా ఏడీఎంసీ సంతోషిమాత, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ఖమేనీ అంత్యక్రియలు వాయిదా

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అంత్యక్రియల తేదీలను త్వరలో వెల్లడిస్తామని వారు తెలిపారు. ఇప్పటికే ఖమేనీ జన్మించిన మషాద్ పట్టణంలో పూడ్చేందుకు భౌతికకాయాన్ని తరలించారు. బుధవారం అంత్యక్రియలు జరుగుతాయని తొలుత ప్రకటించినా చివరి నిమిషంలో వాయిదా వేశారు.

ఖమేనీ మృతిపై భారత్ సంతాపం

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతిపై భారత్ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లిన భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. సంతాప సందేశాన్ని అందజేశారు. మరోవైపు, పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాలకు త్వరగా ముగింపునివ్వాలన్న ప్రధాని మోదీ.. సమస్యలను దౌత్య మార్గంలో పరిష్కరించుకోవాలని, సైనిక ఘర్షణలు దేనికీ పరిష్కారాన్ని చూపలేవని అన్నారు. ఇరాన్‌పై దాడులకు భారత్‌లోని పోర్టులను అమెరికా దళాలు వాడుతున్నాయంటూ అమెరికా ఆర్మీ మాజీ కర్నల్ డగ్లస్ మెక్‌గ్రెగోర్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఈ వ్యాఖ్యలను ఖండించిన భారత్.. ఇవన్నీ తప్పుడు, నకిలీ ఆరోపణలేనని కొట్టిపారేసింది.

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. యూఏఈ, కువైట్, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా, జోర్డాన్ వంటి గల్ఫ్ దేశాలకు విస్తరించిన యుద్ధం, తాజాగా ఇప్పుడు ఆసియా, ఐరోపా సరిహద్దు దేశం అజర్‌బైజాన్‌కూ పాకాయి. అజర్‌బైజాన్‌లోని నఖీచేవాన్ ఎయిర్‌పోర్టుతో పాటు మరో స్కూల్ ప్రాంగణంలో ఇరాన్ డ్రోన్ దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో పెద్దయెత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడులను అజర్‌బైజాన్ తీవ్రంగా ఖండించింది. తమ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుకొనే క్రమంలో ఇరాన్‌కు త్వరలోనే గట్టిగా బదులిస్తామని అజర్‌బైజాన్ రక్షణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు తమ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా దాడులను తీవ్రంగా పరిగణించిన ఇరాన్.. అగ్రరాజ్యానికి చెందిన ట్యాంకర్‌ను పేల్చేసింది. ఇదిలాఉండగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతిపై భారత్ సంతాపం వ్యక్తం చేసింది.

ప్రతీకారం తీర్చుకొంటాం: ఇరాన్

ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా దాడిని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్రంగా ఖండించారు. దీనికి తగిన ప్రతీకారం తీర్చుకొంటామని హెచ్చరించారు. ఆయన ప్రకటన వెలువడిన కొద్దిసేపట్లోనే పర్షియన్ గల్ఫ్‌లోని అమెరికాకు చెందిన ఓ ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. దీంతో నౌక నుంచి పెద్దయెత్తున మంటలు చెలరేగాయి. ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. మరోవైపు, కువైట్ సమీపంలోని జలాల్లో ప్రయాణిస్తున్న ఓ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడులు జరిపింది. భారీ పేలుడు శబ్దంతో ట్యాంకర్‌లోని ఇంధనం సముద్రంలోకి ఒలికిపోయింది. ఇంకోవైపు, దోహాలోని పలు ప్రాంతాలపై ఇరాన్ డ్రోన్ దాడులు చేసినట్టు సమాచారం. లెబనాన్‌లోని 80 హెజ్బొల్లా స్థావరాలను ఇరాన్ ధ్వంసం చేసింది. ఐరిస్ దేనాపై దాడులు జరిగి 24 గంటలు గడువకముందే ఇరాన్‌కు చెందిన మరో నౌక శ్రీలంక దిశగా కదులుతున్నట్టు శ్రీలంక మంత్రి నలిందా జయతిస్సా తెలిపారు. తమ దేశ ప్రాదేశిక జలాల దగ్గరలో ఆ నౌక ఉన్నదన్న ఆయన.. నౌకలోని వారి ప్రాణాలను రక్షించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ నౌకపైన కూడా అమెరికా దాడులు చేయవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్‌లో 1,230 మంది మృతి

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా గడిచిన 100 గంటల్లో ఇరాన్‌పై 2 వేల దాడులు జరిపి 20 నౌకలను ముంచేశామని అమెరికా ప్రకటించింది. ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ అమెరికాఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్‌లో 1,260 మంది పౌరులు మరణించినట్టు ఇరాన్‌కు చెందిన ఓ ఏజెన్సీ వెల్లడించింది. ఘర్షణలు ప్రారంభమైన నాటి నుంచి బుధవారం వరకూ తమ వైమానిక దళం ఇరాన్‌పై 5 వేలకు పైగా బాంబులతో దాడులు చేసిందని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ దాడుల్లో వేలాదిమంది ఇరాన్ సైనికులు మరణించినట్టు తెలిపింది. తమ ఆపరేషన్ మరో రెండు వారాల పాటు కొనసాగవచ్చని అభిప్రాయపడింది. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టులోని ఐఆర్‌జీసీ స్థావరంపై తాజాగా దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ వెల్లడించింది. అమెరికా మద్దతుతో ఇరాన్‌పై యుద్ధానికి తాము సిద్ధమైనట్టు ఉత్తర ఇరాక్‌లోని ఖుర్దు గ్రూప్ ప్రకటించింది.

అణ్వాయుధ కార్యక్రమం నిలిపివేత పరిశీలిస్తున్నాం: ఇరాన్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ.. అణ్వాయుధ కార్యక్రమాన్ని ఆపివేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగశాఖ డిప్యూటీ మంత్రి మాజిద్ తఖ్త్ ప్రకటించినట్టు వీడియోలు వైరల్‌గా మారాయి. తాము అణు ప్రోగ్రామ్‌ను నిలిపేయాలంటే.. తమకు సంతృప్తికర ప్రత్యామ్నాయాన్ని అమెరికా ప్రతిపాదించాల్సి ఉంటుందని ఆయన ఓ షరతు పెట్టినట్టు ఆ వీడియోలో ఉన్నది. దీనిపై ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ స్పందించింది. మాజిద్ మాట్లాడిన వీడియో ఇప్పటిది కాదని, అమెరికాతో గతంలో జరిగిన చర్చలకు సంబంధించినదని స్పష్టం చేసింది.

అమెరికాలో ఖండాంతర అణు క్షిపణి పరీక్ష

అమెరికాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణిని అగ్రరాజ్యం పరీక్షించింది. ఈ అణు క్షిపణి పరీక్ష మంగళవారమే జరుగగా.. ఆ పరీక్షకు సంబంధించిన వివరాలు తాజాగా బయటికొచ్చాయి. కాలిఫోర్నియా తీరంలోని వాండెన్‌బర్గ్ స్పేస్‌ఫోర్స్ బేస్ నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు మినిట్ మ్యాన్3 బాలిస్టిక్ మిస్సైల్ ను అమెరికా ఎయిర్‌ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ పరీక్షించింది. ఆయుధాల్లేని ఈ ఖండాంతర క్షిపణి మార్షల్ ఐలాండ్స్‌లో నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించినట్లు యూఎస్ స్పేస్‌ఫోర్స్ వెల్లడించింది. ఈ పరీక్ష విజయవంతమైందని, అత్యంత కచ్చితత్వంతో క్షిపణి లక్ష్యాన్ని చేరుకుందని తెలిపింది. దీనిలో న్యూక్లియర్ పేలోడ్‌ను అమర్చవచ్చు. జపాన్‌లోని హిరోషిమాపై జారవిడిచిన అణుబాంబు కంటే 20 రెట్లు శక్తిమంతమైన అణు వార్‌హెడ్‌లను ఇది మోసుకెళ్లగలదు. గతంలో పలుమార్లు దీని శక్తి సామర్థ్యాలను అమెరికా పరీక్షించింది. ఈ క్షిపణి గంటకు 15 వేల మైళ్ల వేగంతో 6 వేల మైళ్ల దూరం వరకు ప్రయాణించగలదు. దీన్ని ప్రయోగించిన కొన్ని నిమిషాల్లోనే లక్ష్యాన్ని ఛేదించగలదు. చివరగా గత ఏడాది నవంబర్‌లో మినిట్‌మ్యాన్3ని అమెరికా పరీక్షించింది.

ట్రంప్ చర్యకు అమెరికా సెనెట్ ఆమోదం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమైన వేళ అత్యంత శక్తివంతమైన ఖండాంతర అణు క్షిపణి 'మినిట్‌మ్యాన్3'ని అమెరికా ఎయిర్‌ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ విజయవంతంగా పరీక్షించింది. అత్యంత కచ్చితత్వంతో ఈ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించినట్టు వెల్లడించింది. ఇరాన్‌పై ట్రంప్ సర్కార్ చేపట్టిన సైనిక చర్యకు అమెరికా సెనెట్‌లో మద్దతు లభించింది. ట్రంప్ సైనిక చర్యకు మద్దతుగా 53 మంది ఓటేయగా.. 47 మంది వ్యతిరేకించారు. ఇరాన్‌లో పాలకులు మారేవరకూ అమెరికా ఈ యుద్ధాన్ని కొనసాగిస్తుందని ఇజ్రాయెల్ అధికారి ఒకరు పేర్కొన్నారు. దీనిపై ఇరాన్ తీవ్రంగా మండిపడింది. తమ దేశంలో పాలన మార్పునకు ప్రయత్నిస్తే ఇజ్రాయెల్‌లోని డిమోనా అణుప్లాంట్‌ను పేల్చేస్తామని హెచ్చరించింది.

తెలంగాణ ఫస్ట్ అజెండాతో కొత్త పార్టీ

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్షాలుగా పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించిన ఆమె, తెలంగాణ హక్కుల పరిరక్షణే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని తెలిపారు. గురువారం అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు కాలినడకన వెళ్లే ముందు మీడియాతో మాట్లాడిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పలు కీలక రాజకీయ వ్యాఖ్యలు చేశారు. నాలుగేళ్లుగా తాను చేయని తప్పుకు తనపై అవాకులు చెవాకులు వాగుతూ తనను, తన కుటుంబాన్ని తీవ్ర మానసిక వేదనకు గురిచేశారని ఆమె అన్నారు. అయితే తాము నిజాయితీగా ఉన్నందున దేవుని ఆశీస్సులతో ఆ కేసును కోర్టు పూర్తిగా కొట్టివేసిందని తెలిపారు. స్వామివారి ఆశీస్సులు తీసుకునేందుకే ఈ రోజు తిరుమలకు వచ్చామని, కాలినడకన స్వామివారిని దర్శించుకునే మొక్కు ఉండటంతో అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు వెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తమ కుటుంబ సభ్యులతో పాటు తెలంగాణ జాగృతి సభ్యులు, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తమ శ్రేయోభిలాషులు కూడా పాల్గొన్నారని పేర్కొన్నారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నామని, ఆ పార్టీకి కూడా స్వామివారి ఆశీస్సులు తీసుకుంటామని కవిత వెల్లడించారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా, ఎలాంటి బేధభావాలు లేకుండా పనిచేసే పార్టీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పార్టీ ఏర్పాటయ్యాక కూడా కొత్త కార్యక్రమాలు చేపడతామని, మళ్లీ స్వామివారి ఆశీస్సుల కోసం తిరుమలకు వస్తామని తెలిపారు.

ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి కోసం ఎదురుచూస్తున్నారు

తెలంగాణలో ప్రస్తుతం ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ

శక్తి కోసం ఎదురుచూస్తున్నారని కవిత పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్షాలుగా పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కారణంగానే ఒక్క హామీ కూడా నెరవేర్చకపోయినా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుందని వ్యాఖ్యానించారు. ప్రజలు స్పష్టంగా ఒక ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఇప్పుడైనా బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆమె అభిప్రాయపడ్డారు. పూటకొక స్టాండ్ మార్చుకునే పార్టీలను ప్రజలు విశ్వసించరని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తాము చాలా ఆలస్యంగా బరిలోకి దిగినప్పటికీ ప్రజలు 40 స్థానాలు ఇచ్చారని తెలిపారు. రాజకీయ పార్టీ అంటే ఆ ప్రాంత ప్రయోజనాలు, ప్రజల మనోభావాలు, అస్తిత్వం, హక్కుల కోసం పనిచేయాలని కవిత అన్నారు. ఎన్నికలే లక్ష్యంగా కాకుండా తెలంగాణ హక్కుల పరిరక్షణే తమ ధ్యేయమని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, మహిళలు, యువతను బీఆర్ఎస్ పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఆ వర్గాల అజెండానే తాము ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

తెలంగాణ హక్కుల పరిరక్షణే లక్ష్యం

తెలంగాణ ఫస్ట్, తెలంగాణ హక్కుల పరిరక్షణే తమ లక్ష్యమని కవిత చెప్పారు. తెలంగాణ ప్రజలు అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని కోరుకునే మానవతావాదులని అన్నారు. తాము ఆంధ్ర ప్రజలను ఎప్పుడూ ద్వేషించలేదని, ఆంధ్ర రాజకీయ నాయకుల ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించామని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాలు విడిపోయాయని, ఇక ఎవరి బాటన వారు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. తిరుమలలో కల్తీ లడ్డు అంశంపై తెలంగాణ ప్రజల మనోభావాలు కూడా దెబ్బతిన్నాయని కవిత అన్నారు. వెంకటేశ్వర స్వామివారికి దేశవ్యాప్తంగా కోట్లాది భక్తులు ఉన్నారని, టీటీడీ వ్యవహారాల్లో భక్తులకు విశ్వాసం కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. తాను సిరిసిల్ల నుంచి పోటీ చేస్తానని తన కుమారుడు ఎక్కడా చెప్పలేదని, అనని మాటలను మీడియా ప్రసారం చేయవద్దని కోరారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో లీగల్‌గా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. నీతి, నిజాయితీగా ఉండే వారికి దేవుని ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని అన్నారు. హైడ్రా వ్యవహారంపై స్పందిస్తూ పెద్దలను కాపాడుతూ పేదలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. ఏ ప్రభుత్వం అయినా పెద్దల కోసం పేదలకు అన్యాయం చేస్తున్న పరిస్థితి మారాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు.

క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠ

- క్యాంప్‌లోనే కౌన్సిలర్లు
- 16న ఆలస్యమే అల్లర్లకు దారి తీసిందా...?

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, మార్చి 5: మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక పై ఇంకా ఉత్కంఠకొనసాగుతుంది. బీఆర్ ఎస్, సీపీఐ కౌన్సిలర్లు ఇంకా క్యాంప్‌లోనే ఉన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు మాత్రం ఇండ్లలోనే ఉన్నారు. రాష్ట ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో ఆయా వార్డుల్లో గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు కౌన్సిలర్లు ప్రారంభిస్తున్నారు. అంతేగాకుండా రాష్ట్రంలో క్యాతన్‌పల్లి మున్సిపాలిటి గురించే చర్చ జరుగుతుంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు లేకపోవడంతో బీఆర్ ఎస్ సీపీఐ పొత్తు కలిసి వచ్చి 14 సీట్లను గెలుచుకుంది. ఫిబ్రవరి 16న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉండగ సమయానికి బీఆర్ ఎస్, సీపీఐ కౌన్సిలర్లు రాకపోవడంతో వాయిదా పడింది. ఎందుకు సకాలంలో హాజరుకాలేకపోయారని కూడ ప్రజల్లో చర్చ జరుగుతుంది. ఆ ఒక్క రోజు ఆలస్యమే ఈ గొడవలకు కారణమైందని పరిశీలకులు పేర్కొంటున్నారు. తిరిగి ఫిబ్రవరి 17న చైర్మన్, వైస్‌చైర్మన్ ఎంపిక ఉండగా బీఆర్ ఎస్, సీపీఐతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు కూడ పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో 144 సెక్షన్ విధించారు. పెద్దఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. గొడవలను నియంత్రించేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. మాజీ ఎమ్మెల్యే సుమన్ వాహనాన్ని అడ్డుకొని నిబంధనల ప్రకారం వెళ్లవద్దని అనడంతో ఆయన వాగ్వి

వాదానికి దిగారు. అప్పటికి మోహరించి వారు ఆందోళన చేపట్టడంతో పెద్ద ఎత్తున గొడవకు దారి తీసింది. మంత్రి , ఎంపీ వంశీ ప్రయాణిస్తున్నటువంటి వాహనంపై రాళ్లు రువ్వడంతో ఆ వాహనం అద్దాలు పగిలాయి. మరో కానిస్టేబుల్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో పోలీసులకు చెదర కొట్టారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిలర్లు కూడ గొడవ జరుగడంతో ఎన్నిక వాయిదా వేశారు. దీంతో పెద్ద ఎత్తున బీఆర్ ఎస్, సీపీఐ పెద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు ఆందోళనకారులను చెదరకొట్టారు. దీంతో బాల్క సుమన్‌తో పాటు 20 మందిపై కేసులు నమోదయ్యాయి. ఆయనను మరుసటి రోజు ఆయనను అరెస్టు చేసి ముఖ్య అనచురుడు మూల రాజిరెడ్డని అరెస్టు చేసి ఆదిలాబాద్‌కు తరలించారు. ఇంకా కేసులైన నాయకులు పరారీలో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నారు. రెండు రోజుల క్రితం బీఆర్ ఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, బండారి సూరిబాబులను పోలీసులు అరెస్టు చేసి ఆదిలాబాద్‌కు పంపించారు. ఇంకా మిగితా వారి కోసం గాలిస్తున్నారు. మొత్తానికి 16న సమయానికి హాజరుకాకపోవడంతోనే ఈ గొడవలకు కారణమైందనే చర్చ ప్రజల్లో జరుగుతుంది. ఒక వైపు ప్రజాస్వామ్యాన్ని మంత్రి అపహస్యం చేస్తున్నాడని బీఆర్ ఎస్,, సీపీ ఐ నాయకులు ఆరోపిస్తుండగా మరో వైపు బాల్క సుమన్ తన అనచరులతో అల్లర్లు సృష్టిస్తునాÖడని మంత్రి ఆరోపించారు. తన కారుపై రాళ్లు విసిరిన నేను ఫిర్యాదు చేయలేదని తెలిపారు. పోలీసులకు గాయాలు కావడంతోనే పోలీసులు నమోదు చేశారని తెలిపారు. మెజార్టీ ఉన్న వారు 16 న ఎంపిక రాలేదని మంత్రి ప్రశ్నిస్తున్నారు. అన్ని గొడవలకు వారే కారణమని మంత్రి ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా తన తండ్రి తాము ప్రజా సేవ కోసం రాజకీయల్లోకి వచ్చామని తెలిపారు. ఇప్పటి కూడ వారు దీనిపై ఆత్మ విమర్శ చేసుకుంటే మంచిదని తెలిపారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని చట్టం ముందు అందరూ సమానులే అంటూ పేర్కొంటున్నారు. భవిష్యత్‌లో క్యాతన్‌పల్లి మున్సిపాలిటి ఎంపిక తేది ఎప్పుడు వస్తుందోతెలియడం లేదు. బీఆర్ ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ ఎన్నిక తేదీ ఎప్పుడు వస్తుందని ఆసక్తి ఎదురు చూస్తున్నారు.

ఇరాన్ సుప్రీంలీడర్ ఎన్నిక విషయంలో నేను ఇన్వాల్వ్ అవుతా. ఖమేనీ కొడుకు మొజ్తబా సుప్రీంలీడర్ అయ్యే అవకాశం ఉంది. దీన్ని అంగీకరించబోం. శాంతి, సామరస్యాన్ని తీసుకొచ్చే వ్యక్తిని కోరుకుంటున్నాం. వాళ్లు టైమ్ వేస్ట్ చేస్తున్నారు. ఖమేనీ కొడుకు ప్రభావం చూపలేదు. వెనిజులాలో డెల్సీని ఎంపిక చేసినట్లే ఇక్కడా నేను నియామకంలో పాల్గొనాలి.

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

రాష్ట్రీయం

వైభవంగా డిప్యూటీ సీఎం భట్టి కుమారుడి వివాహం

- తరలివచ్చిన రాజకీయ, సినీ ప్రముఖులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 5: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పెద్ద కుమారుడు సూర్య విక్రమాదిత్య మల్లు వివాహ వేడుక శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎరీనాలో అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ఉదయం 9 గంటల నుంచే ప్రారంభమైన ఈ వేడుకకు దేశ, రాష్ట్ర రాజకీయ ప్రముఖులు, సినీ రంగ దిగ్గజాలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జార్కండ్ సీఎం హేమంత్ సోరెన్, మంత్రులు అడ్లూరి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, ప్రొఫెసర్ కోదండరాం, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్, కాంగ్రెస్‌నేతలు కేవీపీ ప్రతిపక్ష నేతలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేతలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంద కృష్ణ మాదిగ, సినీ ప్రముఖులు మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, శ్రీకాంత్, తనికెళ్ల భరణి తదితరులు వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

అభిమానుల మధ్య డిప్యూటీ సీఎం

రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో వివాహ వేదిక సందడిగా మారింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన హోదాను పక్కన పెట్టి, వచ్చిన ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి పేరుపేరునా పలకరించారు. వారితో కలిసి ఫోటోలు దిగుతూ, కుశల ప్రశ్నలు అడుగుతూ వారి పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు మరియు ఇతర రంగాలకు చెందిన ప్రముఖుల రాకతో జీఎంఆర్ ఎరీనా పరిసరాలు కోలాహలంగా మారాయి.

విజయ్, రష్మికలకు సీఎం రేవంత్ ఆశీస్సులు

సీఎం రేవంత్ రెడ్డి సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులను గురువారం కలిశారు. వివాహ బంధంతో ఒక్కటైన వారి వెళ్లిన సీఎం, వారికి పుష్పగుచ్ఛం అందించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్త దంపతులు రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో కూడా సీఎం కాసేపు ముచ్చటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వారి ఇంటికి వెళ్లి ఆశీర్వదించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

- ప్రతిపక్షం, హైదరాబాద్

ముగిసిన కడియం విచారణ

- దానం నాగేందర్ విచారణ వాయిదా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 5: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. గురువారం కడియం శ్రీహరిని స్పీకర్ విచారించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ విచారణ ముగిసింది. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తి కాలేదు. ఆయన విచారణను మార్చి 7 శనివారానిక వాయిదా వేశారు. ఈ కేసులో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు సూచించారు. దీంతో ఈ పిటిషన్లను స్పీకర్ శనివారం విచారించనున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురి ఎమ్మెల్యేల విచారణ ఇప్పటికే పూర్తయింది. వారందరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చీట్ ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను విచారించాల్సి ఉంది. ఆయన విచారణ కూడా పూర్తయితే.. ఈ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఖమ్మం జిల్లా మీడియా ఇన్‌చార్జిగా వెంకటేశ్వర్లు

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, మార్చి 5: తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఖమ్మం జిల్లా మీడియా ఇన్చార్జిగా మంద వెంకటేశ్వర్లు ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. ఖమ్మంలో జరిగిన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర చైర్మన్ డా॥చీమ శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం పాత కమిటీని రద్దుచేసి నూతన కమిటీని ఎన్నుకున్నారని. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ పాలకుర్తి కృష్ణను, వీరితోపాటు మరికొందరిని నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా మీడియా ఇన్చార్జిగా నియామక పత్రం పొందిన మంద వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యమ కారుల ఫోరం అభ్యున్నతి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం మీడియా ద్వారా తనవంతు కృషి చేస్తానని ఉద్యమ కారుల ఫోరం తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

అర్ధరాత్రి ఆపదొస్తే.. ఖమ్మం వెళ్లాల్సిన అవస్థలు ఉండవు

- గిరిజన బిడ్డల ప్రాణాలకు మంత్రి పొంగులేటి భరోసా..
- తిరుమలాయపాలెంలో రూ. 26 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రికి శంకుస్థాపన
- డిసెంబర్ కల్లా పనులు పూర్తి కావాలి.. కాంట్రాక్టర్‌కు ఆదేశాలు

ప్రతిపక్షం, ఖమ్మం, మార్చి 5: "అర్ధరాత్రి వేళ ఆపద వస్తే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఖమ్మం పరుగు తీయాల్సిన కష్టాలు ఈ ప్రాంత గిరిజన బిడ్డలకు ఇక ఉండవు. పేదవాడి సొంత గడ్డపైనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సుమారు రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు.

అత్యాధునిక పరికరాలతో..

గతంలో కేవలం 30 పడకలతో, అరకొర వసతులతో ఉన్న ఈ ఆసుపత్రి వల్ల ప్రజలు పడ్డ ఇబ్బందులను మంత్రి గుర్తు చేసుకున్నారు. "నాడు ప్రసవం కావాలన్నా, అత్యవసర చికిత్స కావాలన్నా ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడం తప్ప మరో మార్గం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వం వచ్చాక, జిల్లా హెడ్ క్వార్టర్ ఆసుపత్రిని మరిపించేలా ఇక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నాం. డయాలసిస్ యూనిట్లు, అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్యాన్ని రాబోయే కొద్ది నెలల్లోనే ఇక్కడ అందుబాటులోకి తెస్తాం" అని భరోసా ఇచ్చారు.

డాక్టర్లు, సిబ్బంది ఇక్కడే ఉండాలి

వైద్య సిబ్బంది పనితీరుపై మంత్రి దిశానిర్దేశం చేశారు. "ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెట్టి భవనాలు కట్టవచ్చు.. కానీ డాక్టర్ అందుబాటులో ఉంటారనే నమ్మకం రోగికి కలిగినప్పుడే ఆ ఆసుపత్రికి సార్థకత ఉంటుంది. డాక్టర్లు, సిబ్బంది ఎక్కడో ఉండటం కాదు.. ఈ హెడ్ క్వార్టర్స్‌లోనే నివసించాలి. చర్ల, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడ కూడా అదే అంకితభావం కావాలి. విధుల్లో చిత్తశుద్ధి చూపే సిబ్బందికి నా నియోజకవర్గం తరపున ప్రత్యేక బహుమతులు అందజేస్తాను" అని ప్రకటించారు.

విద్య, వైద్యమే మా ప్రభుత్వ అజెండా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాడికి నాణ్యమైన చదువు, వైద్యం అందించడమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. "కేవలం వైద్యమే కాదు.. రాబోయే రోజుల్లో విద్యారంగంలోనూ విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. గడిచిన రెండేళ్ల మూడు నెలల కాలంలోనే మౌలిక వసతుల కల్పనలో మనం ఎంతో పురోగతి సాధించాం. ఈ ప్రభుత్వం ఎవరినీ నొప్పించదు.. కానీ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలి" అని స్పష్టం చేశారు. "మార్చిలో పనులు మొదలవుతున్నాయి.. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, మళ్లీ డిసెంబర్ నాటికే ఈ ఆసుపత్రిని ప్రారంభించాలి" అని గడువు విధించారు. అనంతరం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు , మండల నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి ముగ్గురి మృతి

- టోలీచౌకీలో తీవ్ర విషాదం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 5: నగరంలోని టోలీచౌకీలో ఘోర ప్రమాదం జరిగింది. అల్ హస్నాత్ కాలనీలో భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన గోవా కర్రలు కూలిపోవడంతో పైనుంచి కిందపడి ముగ్గురు కార్మికులు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతి చెందిన వారు శ్రీకాకుళం జిల్లాకు చెందిన తిరుపతి రావు, అది నారాయణగా గుర్తించారు. గాయపడిన వారు శ్రీకాకుళానికి చెందిన ఆర్.రమేష్, ఒడిశాకు చెందిన ఏం.రమేష్, బండ్లగుడాకు చెందిన లాల్ అహ్మద్‌గా గుర్తించారు. గాయపడ్డ వారిని లంగర్ హౌస్‌లోని ఆలివ్ ప్రైవేట్ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. భవనం పక్కనే ఆటోలో ఉన్న వారిపై గొవా కర్రలు పడటంతో అందులో ఉన్నవారు కూడా గాయపడ్డట్లు సమాచారం. భవన నిర్మాణం కోసం కట్టిన గోవా కర్రలపై నిలబడి పనులు చేస్తుండగా ఒక్కసారిగా కర్రలు కూలడంతో ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం పనులు జరుగుతున్నాయని గుర్తించిన జీహెచ్ఎంసీ అధికారులు యజమానికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

ప్రమాదంపై టీపీసీసీ చీఫ్ దిగ్భ్రాంతి

టోలీచౌకి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం, మరో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు కావడం అత్యంత దురదృష్టకరమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించాల్సిందిగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నిర్మాణ ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అధికారులు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

మాకు అనుమతులు అక్కర్లేదు.. అంతా మా ఇష్టం!

- షాద్ నగర్ బైపాస్‌లో చెట్ల నరికివేత కలకలం
- విచ్చలవిడిగా చెట్లు తొలగించిన విద్యుత్ కాంట్రాక్టర్
- అటవీశాఖ అనుమతులు లేకుండానే వేర్లతో సహా నరికివేత
- నరికి వేసిన చెట్లు ఎక్కడికి తరలించారు?
- అధికారుల మౌనం వెనుక మర్మం ఏమిటి?

ప్రతిపక్షం, షాద్ నగర్, మార్చి 5: ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారం పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ రోడ్ల ఇరువైపులా చెట్లు నాటిస్తుంటే, మరోవైపు షాద్ నగర్ పట్టణంలో చెట్ల నరికివేత సంచలనం రేపుతోంది. పట్టణంలోని బైపాస్ రోడ్డులో, దూసకల్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు కిరువైపులా ఉన్న చెట్లను విద్యుత్ పనుల పేరుతో ఒక కాంట్రాక్టర్ వేర్లతో సహా నరికివేసి ఎక్కడికో తరలించిన ఘటన స్థానికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, విద్యుత్ శాఖ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా చెట్లను పూర్తిగా తొలగించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెట్లను ఎందుకు నరికివేస్తున్నారని ప్రశ్నించిన వారికి "మాకు అనుమతులు అక్కర్లేదు..అంతా మా ఇష్టం" అనే విధంగా హుకూం జారీ చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తూ హరితహారం కార్యక్రమం ద్వారా రోడ్ల పక్కన వేలాది మొక్కలను నాటి పెంచుతున్నాయి. ఒక్క మొక్కను పెంచడానికి సుమారు వెయ్యి రూపాయలకుపైగా ఖర్చు చేస్తూ భవిష్యత్ తరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అలాంటి చెట్లు పెరిగి బాటసారులకు నీడనిస్తూ, ఆక్సిజన్ అందిస్తూ పర్యావరణానికి మేలు చేస్తున్న సమయంలో వాటిని ఇష్టారాజ్యంగా నరికివేయడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నిబంధనల ప్రకారం చెట్లను నరికివేయాలంటే ముందుగా అటవీ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అంతేకాకుండా ఒక చెట్టు నరికితే దానికి బదులుగా పది మొక్కలు నాటాల్సి ఉంటుంది. అలాగే నరికి వేసిన చెట్లను అటవీ శాఖ కార్యాలయానికి తరలించే విధంగా పలు నిబంధనలు ఉన్నాయి. అయితే షాద్ నగర్ బైపాస్ రోడ్డులో నరికి వేసిన చెట్లు ఎక్కడికి తరలించారన్న విషయంపై కూడా స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున చెట్లను తొలగించినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. అటవీ శాఖ అనుమతులు లేకుండా చెట్లను తొలగించినప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం పాటించడం వెనుక మర్మం ఏమిటి అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై అటవీ శాఖ అధికారులను సంప్రదించగా చెట్ల నరికివేతకు సంబంధించి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదని తెలిపారు. ఒకవేళ అనుమతులు తీసుకున్నట్లయితే నరికి వేసిన చెట్లను అటవీ శాఖ కార్యాలయానికి తరలించాల్సి ఉంటుందని చెప్పారు. అనుమతులు లేకుండా చెట్లను నరికితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే ఇప్పటికైనా ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు స్పందించి చెట్ల నరికివేతకు కారణమైన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇరాన్ నౌకపై అమెరికా దాడి చేస్తే ఇండియాను నిందించడంలో లాజిక్ లేదు. భారత తీరానికి 250 నాటికల్ మైళ్ల దూరంలో, సముద్ర పరిధికి అవతల అటాక్ జరిగింది. సమీపంలో ఉన్నంత మాత్రాన ప్రతి ఘటనకు ఆ దేశం బాధ్యత వహించదు. అంతర్జాతీయ జలాల్లో కార్యకలాపాలను ఇండియా నియంత్రించదు. ఇండియాను జవాబుదారీగా చేయాలనుకోవడం సమర్థనీయం కాదు.

- బీజేపీ నేత అమిత్ మాలవీయ

ఓపెన్ వాయిస్

సోషల్ మీడియాలో 'అడల్ట్ కంటెంట్' సెగ

ప్రస్తుతం సోషల్ మీడియా ప్రపంచాన్ని ఒక కొత్త వైరస్ వణికిస్తోంది. అదే 'అడల్ట్ కంటెంట్'. ఒకప్పుడు సెన్సార్‌షిప్ ఉన్న సినిమాలకో లేదా ప్రత్యేక వెబ్‌సైట్లకో పరిమితమైన ఈ అశ్లీల కంటెంట్.. ఇప్పుడు మన అరచేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్ ద్వారా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ ఫీడ్‌లలో యథేచ్ఛగా దర్శనమిస్తోంది. సాధారణంగా సోషల్ మీడియా సంస్థలు అడల్ట్ కంటెంట్‌ను గుర్తించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అల్గారిథమ్‌లను వాడుతుంటాయి. అయితే.. కేటుగాళ్లు అంతకు మించి ఆలోచిస్తున్నారు. ఏఐ అల్గారిథమ్‌లను మోసం చేసేందుకు వీడియోలపై రకరకాల ఫిల్టర్లు వాడటం, అసభ్య పదజాలాన్ని డైరెక్ట్‌గా వాడకుండా కోడ్ లాంగ్వేజ్‌ను ఉపయోగించడం చేస్తున్నారు. ఫలితంగా ఈ వీడియోలు ఫిల్టర్లకు చిక్కకుండా నెటిజన్ల ఫీడ్‌లోకి వచ్చేస్తున్నాయి. ఇది నేటి యువత ఆలోచనా ధోరణిని చెడు మార్గం వైపు మళ్లిస్తోందని సామాజిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో హీరోయిన్ల డీప్‌ఫేక్ వీడియోలు, ఇతర అసభ్యకర పోస్టుల విషయంలో 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వ్యవహరించిన తీరుపై భారత ప్రభుత్వం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐటీ నిబంధనల ప్రకారం కంటెంట్ నియంత్రణ చేయకపోతే.. ఆ సంస్థకు ఉన్న 'సేఫ్ హార్బర్' రక్షణను తొలగిస్తామని, అవసరమైతే దేశంలో కార్యకలాపాలు నిలిపివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. దీనిపై స్పందించిన ఎక్స్ యాజమాన్యం, ఈ ఏడాది జనవరిలో భారీ ప్రక్షాళన చేపట్టింది. అధికారిక లెక్కల ప్రకారం.. నిబంధనలు ఉల్లంఘించిన 600కు పైగా ఖాతాలను శాశ్వతంగా బ్లాక్ చేయడంతో పాటు, సుమారు 3500కు పైగా అడల్ట్ పోస్టులను తొలగించింది. ఎక్స్ ప్లాట్‌ఫామ్ ఇటీవల తన పాలసీలో కీలక మార్పులు చేసింది. 'కన్సెన్సువల్ అడల్ట్ కంటెంట్' (పరస్పర అంగీకారంతో కూడిన అశ్లీల కంటెంట్) ను అధికారికంగా అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. అడల్ట్ కంటెంట్ క్రియేటర్ల ద్వారా ప్లాట్‌ఫామ్‌కు భారీగా యూజర్ ట్రాఫిక్ రావడంతో పాటు సబ్‌స్క్రిప్షన్ ఆదాయం లభిస్తోంది. అందుకే దీనిని పూర్తిగా నిషేధించడానికి ఎక్స్ సిద్ధంగా లేదనడంలో సందేహం లేదు. అయితే.. 18 ఏళ్ల లోపు యువతకు, తమ ప్రొఫైల్‌లో పుట్టిన తేదీ పేర్కొనని వారికి ఈ కంటెంట్ కనిపించకుండా 'ఏజ్ గేటింగ్' అనే సాంకేతికతను అమలు చేస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మెటా ప్లాట్‌ఫామ్‌లు నిబంధనల విషయంలో ఎక్స్ కంటే కఠినంగా ఉన్నాయని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఒక అసభ్యకర అకౌంట్‌ను బ్లాక్ చేస్తే, అదే పేరుతో లేదా వేరే ఐడీతో మరో పది అకౌంట్లు పుట్టుకొస్తున్నాయి. ఇది ఒక సవాలుగా మారింది. టెక్నాలజీ మారుతున్న కొద్దీ అశ్లీలత కొత్త రూపాలు సంతరించుకుంటోంది. కేవలం కంపెనీల సెన్సార్‌షిప్‌పైనే ఆధారపడకుండా, వినియోగదారులు కూడా అవగాహనతో ఉండాలి. అసభ్యకర కంటెంట్‌ను చూసిన వెంటనే రిపోర్ట్ చేయడం, సెట్టింగ్స్‌లో సెన్సిటివ్ కంటెంట్ కంట్రోల్ ఉపయోగించడం ద్వారా కొంతవరకు ఈ ముప్పును అరికట్టవచ్చు. ప్రభుత్వం కూడా ఐటీ చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. సోషల్ మీడియా యాజమాన్యాలు అశ్లీల కంటెంట్‌ను అరికట్టడానికి కేవలం నిబంధనలు విధించడమే కాకుండా, టెక్నాలజీ, హ్యూమన్ వర్కర్ల సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలి. మల్టీలేయర్ AI అల్గారిథమ్స్ ద్వారా అప్‌లోడ్ అయ్యే ప్రతి వీడియోను స్కాన్ చేసి, అసభ్యకరంగా ఉంటే ఆటోమేటిక్‌గా రిజెక్ట్ చేయాలి. ముఖ్యంగా ఏఐని మోసం చేసేలా వాడే ఫిల్టర్లు, కోడ్ లాంగ్వేజ్‌లను గుర్తించేలా అల్గారిథమ్‌లను నిరంతరం అప్‌డేట్ చేయాలి. కేంద్రీకృత ఏజ్ వెరిఫికేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టి, కేవలం ఆధార్ లేదా అధికారిక గుర్తింపు కార్డుల ద్వారా వయస్సు నిర్ధారణ అయిన వారికే సున్నితమైన కంటెంట్ కనిపించేలా చూడాలి. డీప్‌ఫేక్ కంటెంట్‌ను గుర్తించే వాటర్ మార్కింగ్ టెక్నాలజీని వాడాలి. పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిని డివైస్ లెవల్ బ్యాన్ చేయడం ద్వారా కొత్త అకౌంట్లు తెరవకుండా అడ్డుకోవచ్చు. అలాగే.. యూజర్ల నుండి వచ్చే రిపోర్ట్‌లపై స్పందించడానికి హ్యూమన్ మోడరేషన్ టీమ్‌ను పెంచాలి. ఆదాయం కంటే సామాజిక బాధ్యతకే ప్రాధాన్యతనిస్తూ, అశ్లీల కంటెంట్ ద్వారా వచ్చే అడ్వర్టైజ్‌మెంట్ ఆదాయాన్ని నియంత్రించినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
06.03.2026

మహిళాభ్యుదయమే సమాజాభివృద్ధికి మూలమంత్రం

యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

సమాజ అభివృద్ధి, న్యాయం, సమానత్వం గురించి మాట్లాడే ప్రతి సందర్భంలో మహిళల పాత్రను గుర్తించకుండా ముందుకు సాగడం అసాధ్యం. ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈ సత్యాన్ని మనకు మరొకసారి గుర్తుచేస్తుంది. మహిళల హక్కులు, గౌరవం, సమాన అవకాశాల కోసం సాగుతున్న ప్రపంచవ్యాప్త ఉద్యమానికి ఈ దినోత్సవం ఒక ముఖ్య ప్రతీక. నిజానికి ఇదొక వేడుక కాదు; సమాజ నిర్మాణంలో మహిళల పాత్రను గుర్తించడానికి, అలాగే ఇంకా కొనసాగుతున్న అసమానతలను గుర్తుచేసే ఒక చైతన్య దినం. ప్రపంచ సమాజం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఒక ముఖ్యమైన ప్రశ్న మరింత స్పష్టంగా వినిపిస్తోంది: మహిళలకు నిజమైన సమానత్వం ఎప్పుడు లభిస్తుంది? శతాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక అసమానతలు, ఆర్థిక వివక్ష, విద్యా అవకాశాల లోపం వంటి సమస్యల మధ్య మహిళలు తమ హక్కుల కోసం సాగించిన పోరాటాన్ని గుర్తుచేసే రోజే ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం. సమాజం ముందుకు సాగేందుకు అవసరమైన సమానత్వం, గౌరవం, న్యాయం అనే విలువలను గుర్తుచేసే ఒక అంతర్జాతీయ ఉద్యమం. ఈ దినోత్సవానికి చరిత్రలో ప్రత్యేక నేపథ్యం ఉంది. 20వ శతాబ్దం ప్రారంభంలో మహిళలకు ఓటు హక్కు, సమాన వేతనం, పని హక్కులు వంటి ప్రాథమిక హక్కుల కోసం జరిగిన ఉద్యమాల నుంచి ఈ దినోత్సవం పుట్టుకొచ్చింది. తరువాత అంతర్జాతీయ స్థాయిలో ఈ ఉద్యమానికి గుర్తింపు లభించి, 1975లో యునైటెడ్ నేషన్స్ అధికారికంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గుర్తించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా మహిళల సాధికారతకు సంబంధించిన చర్చలు, కార్యక్రమాలు, సామాజిక చైతన్యానికి ఒక వేదికగా మారింది.

ప్రపంచంలో మహిళల స్థితి – తాజా గణాంకాలు చెప్పే వాస్తవం

నేటి ప్రపంచం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, మహిళల జీవితాల్లో అసమానతలు ఇంకా స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాజా అంతర్జాతీయ నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఇంకా అనేక రంగాల్లో వెనుకబడి ఉన్నారు. ప్రపంచ స్థాయిలో మహిళలు పురుషులకంటే సగటున సుమారు 20 శాతం తక్కువ వేతనం పొందుతున్నారు. అదే విధంగా ప్రపంచంలోని పార్లమెంట్లలో మహిళల ప్రాతినిధ్యం సుమారు 27 శాతం మాత్రమే. అంటే రాజకీయ నిర్ణయాలలో మహిళల స్వరం ఇంకా పరిమితంగానే ఉంది. ఇంటిపనుల విషయంలో కూడా అసమానత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు పురుషులకంటే సుమారు రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువ అపరిహార్య ఇంటిపనులు నిర్వహిస్తున్నారు. పిల్లల సంరక్షణ, వృద్ధుల సేవ, గృహ నిర్వహణ వంటి పనులు ఎక్కువగా మహిళలపై పడుతున్నాయి. డిజిటల్ ప్రపంచంలో కూడా మహిళలు వెనుకబడి ఉన్నారు. ప్రపంచంలో కోట్లాదిమంది మహిళలు ఇంకా ఇంటర్నెట్ సదుపాయాలను సమానంగా ఉపయోగించలేకపోతున్నారు. ఇది విద్య, ఉపాధి అవకాశాలు, సమాచార ప్రాప్తిలో కూడా ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితిని విశ్లేషించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం తన నివేదికలో ఆందోళనకరమైన

విషయాన్ని వెల్లడించింది: ప్రస్తుతం ఉన్నటువంటి ఇదే వేగం కొనసాగితే ప్రపంచంలో పూర్తి లింగ సమానత్వం సాధించడానికి ఇంకా శతాబ్దానికి పైగా సమయం పట్టవచ్చని అంచనా.

విద్య, విజ్ఞాన రంగాల్లో మహిళల పురోగతి

విద్యా రంగంలో మహిళలు గత కొన్ని దశాబ్దాలలో గణనీయమైన పురోగతి సాధించారు. చాలా దేశాలలో బాలికల విద్యా ప్రవేశం గణనీయంగా పెరిగింది. అయినప్పటికీ విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, ఇంజినీరింగ్ వంటి రంగాల్లో మహిళల సంఖ్య ఇంకా తక్కువగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ పరిశోధనలో పాల్గొనే పరిశోధకులలో మహిళలు సుమారు మూడవ వంతు మాత్రమే ఉన్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి అనేక దేశాలు ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభిస్తున్నాయి. భారతదేశంలో కూడా విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, ఇంజినీరింగ్, గణిత శాస్త్ర రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు పలు విద్యాసంస్థలు ప్రత్యేక ప్రోత్సాహక పథకాలు ప్రారంభిస్తున్నాయి. ఉదాహరణకు భారత సాంకేతిక విద్యా సంస్థ ఐఐటీ బాంబే మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేక స్కాలర్‌షిప్ కార్యక్రమాలు ప్రవేశపెట్టి, సాంకేతిక విద్యలో మహిళల ప్రవేశాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తోంది.

భారతదేశంలో మహిళల పరిస్థితి – మార్పులు, సవాళ్లు

భారతదేశంలో మహిళల సాధికారత విషయంలో గత కొన్ని సంవత్సరాలలో కొంత పురోగతి కనిపించినప్పటికీ, ఇంకా అనేక సవాళ్లు పీడిస్తూనే ఉన్నాయి. భారతదేశంలో మహిళల విద్యా స్థాయి గణనీయంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బాలికల పాఠశాల ప్రవేశం పెరుగుతోంది. అంతేకాక స్థానిక స్వయం పాలన సంస్థలలో మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం ద్వారా గ్రామ పాలనలో మహిళల భాగస్వామ్యం కూడా పెరిగింది. ప్రస్తుతం పంచాయతీలలో మహిళా ప్రతినిధులు దాదాపు సగానికి చేరువలో ఉన్నారు. అయితే కార్మిక రంగంలో మహిళల భాగస్వామ్యం ఇంకా పరిమితంగానే ఉంది. అనేకమంది మహిళలు విద్యావంతులైనప్పటికీ ఉద్యోగ అవకాశాలు పొందడంలో లేదా పని కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రత, ఆరోగ్యం, పోషణ వంటి అంశాలు కూడా భారతదేశంలో మహిళల అభివృద్ధికి కీలకమైన సవాళ్లుగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు, పోషకాహార లోపం వంటి సమస్యలు ఇంకా కనిపిస్తున్నాయి.

మహిళా సాధికారత – ఆర్థికాభివృద్ధికి పునాది.

మహిళల సాధికారతను కేవలం సామాజిక న్యాయం పరంగా మాత్రమే చూడడం సరిపోదు. ఇది దేశ ఆర్థిక అభివృద్ధికి కూడా కీలకమైన అంశం. పరిశోధనలు చెబుతున్నదేమిటంటే మహిళలు ఆర్థిక వ్యవస్థలో ఎక్కువగా పాల్గొంటే దేశాల ఆర్థిక వృద్ధి వేగంగా పెరుగుతుంది. మహిళలకు సమాన విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తే కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. పిల్లల ఆరోగ్యం, విద్యా స్థాయి కూడా పెరుగుతుంది. ఈ కారణంగా మహిళల సాధికారతను ఇప్పుడు ప్రపంచం ఒక అభివృద్ధి వ్యూహంగా కూడా పరిగణిస్తోంది.

సమాజ మార్పులో మహిళల పాత్ర

చరిత్ర పరంగా చూసినట్లయితే, సమాజ మార్పుకు మహిళల పాత్ర చాలా ముఖ్యమైనది. విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ, రాజకీయ నాయకత్వం వంటి అనేక రంగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. మహిళ ఒక కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి మార్గదర్శకురాలు. ఒక మహిళ విద్యావంతురాలైతే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుంది. అదే విధంగా మహిళలకు అవకాశాలు కల్పించిన సమాజాలు సాధారణంగా మరింత స్థిరంగా, శాంతియుతంగా ఉంటాయి. మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది: సమాజంలో నిజమైన అభివృద్ధి కావాలంటే మహిళలు సమాన భాగస్వాములుగా ఉండాలి. మహిళలకు గౌరవం, హక్కులు, అవకాశాలు కల్పించడం కేవలం నైతిక బాధ్యత మాత్రమే కాదు; అది సమాజ అభివృద్ధికి అవసరమైన పునాది. మహిళా సాధికారత అంటే కుటుంబం, సమాజం, దేశం, మొత్తం మానవ సమాజం ముందుకు సాగడమే. అందుకని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, మహిళా సమానత్వం లేకుండా సమాజ అభివృద్ధి అసంపూర్ణమే అన్న విషయాన్ని మనమంతా గుర్తుంచుకోవాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

'నాన్న'.. అని పిలవలేని బాల్యం

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884

ఒక విప్లవం వెనుక సిద్ధాంతాలు ఉంటాయి. ఒక ఉద్యమం వెనుక రాజకీయ లక్ష్యాలు ఉంటాయి. కానీ ఆ ఉద్యమాల నీడలో కొన్నిసార్లు మనిషి జీవితంలోని అత్యంత మృదువైన భావోద్వేగాలు.. కుటుంబం, తండ్రి, తల్లి, పిల్లల మధ్య బంధం.. నిశ్శబ్దంగా బలి అవుతాయి. మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి కుమారుడు ముప్పాల శ్రీనివాసరావు విడుదల చేసిన ఈ భావోద్వేగపూరిత సందేశం ఆ నిజాన్ని మరోసారి మన కళ్లముందు నిలబెడుతోంది. గణపతి కుమారుడు భావాలను యథాతథంగా ఆడియో ద్వారా విడుదల చేసిన ఈ ఆడియోలో వినిపించిన మాటలు ఒక రాజకీయ ప్రకటన కాదు. ఒక సిద్ధాంతపరమైన విమర్శ కాదు. అది ఒక కుమారుడి గుండెల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన నిశ్శబ్ద వేదనకు వచ్చిన స్వరం.

విప్లవ నేత వెనుక కనిపించని కుటుంబ కథ

గణపతి అనే పేరు భారతదేశంలో మావోయిస్టు ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. అడవుల్లో దశాబ్దాల పాటు సాగిన ఆయుధ పోరాటంలో ఆయన ఒక ప్రధాన నాయకుడిగా ఎదిగారు. కానీ అదే సమయంలో ఒక కుటుంబం.. ముఖ్యంగా భార్య, కుమారుడు.. ఆయన లేకుండానే జీవితం సాగించాల్సి వచ్చింది. కుమారుడు చెప్పిన మాటల్లో ఒక బాధ స్పష్టంగా వినిపిస్తుంది.. "మనం కలిసి ఉంటే బహుశా 'నాన్న' అనే పదం లక్షల సార్లు పిలిచి ఉండేవాడిని... కానీ ఊహ తెలిసిన తర్వాత ఇప్పుడు మొదటిసారి నాన్న అని సంబోధిస్తున్నాను." ఈ వాక్యం ఒక వ్యక్తిగత బాధ మాత్రమే కాదు. అది విప్లవ రాజకీయాల వెనుక దాగి ఉన్న మానవీయ ఖాళీని ప్రతిబింబిస్తుంది. ఒక నాయకుడి విజయాలు, ఆయన నిర్మించిన రాజకీయ సామ్రాజ్యం ఎంత గొప్పదైనా, తన కుమారుడికి తండ్రిగా ఉండలేకపోయిన వాస్తవం మాత్రం మారదు.

తల్లి కన్నీళ్లలో పెరిగిన బాల్యం

ఈ సందేశంలో అత్యంత హృదయాన్ని కదిలించే అంశం తల్లి గురించి చెప్పిన మాటలు. గణపతి అడవుల్లో విప్లవ పోరాటం కొనసాగిస్తుండగా, ఆయన భార్య సమాజానికి ఎదురుపడలేక ఇంటి గడప దాటకుండా జీవించిందని కుమారుడు చెప్పడం ఒక తీవ్రమైన సామాజిక వాస్తవాన్ని వెలుగులోకి తెస్తుంది. తండ్రి లేకపోవడం వల్ల ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, తన బాధను మరిచిపోయి కుమారుడిని పెంచిన తల్లి కథ వేలాది కుటుంబాల కథను గుర్తు చేస్తుంది. విప్లవం, ఉద్యమం, సిద్ధాంతం అనే పెద్ద పదాల వెనుక, ఒక మహిళ జీవితమంతా నిశ్శబ్దంగా కన్నీటితో

నిండిపోవడం కూడా ఒక నిజమే.

సిద్ధాంతాన్ని ప్రశ్నించని కుమారుడు

ఈ సందేశంలో మరో విశేషం ఏమిటంటే.. కుమారుడు తన తండ్రి ఎంచుకున్న మార్గాన్ని నేరుగా విమర్శించలేదు. "మీరు ఎంచుకున్న సిద్ధాంతాన్ని ప్రశ్నించడం లేదు" అని చెప్పడం ద్వారా ఆయన తన తండ్రి ఆత్మార్పణను గౌరవించినట్టే కనిపిస్తుంది. ఇది ఒక పరిపక్వతను చూపుతుంది. విప్లవ పోరాటం అంటే త్యాగాలు, ప్రాణనష్టాలు, కుటుంబాల నుండి దూరం.. ఇవన్నీ సహజమని ఆయన అంగీకరిస్తున్నాడు. అదే సమయంలో, ఆ త్యాగాల వెనుక మిగిలిపోయిన బాధను కూడా దాచిపెట్టలేదు.

మారుతున్న కాలం – మారుతున్న పోరాట రూపాలు

ఈ సందేశంలో ఒక కీలకమైన ఆలోచన కూడా ఉంది. ఒకప్పటి పరిస్థితులతో పోల్చితే ఇప్పుడు సమాజంలో చాలా మార్పులు వచ్చాయని కుమారుడు చెబుతున్నాడు. నేటి యువతలో ఉన్న అవగాహన, ప్రపంచంతో అనుసంధానం, కొత్త అవకాశాలు.. ఇవన్నీ కొత్త మార్గాలను సూచిస్తున్నాయని ఆయన భావిస్తున్నాడు. అడవుల్లో ఆయుధాలతో సాగిన పోరాటం కంటే, నేటి కాలంలో జ్ఞానం, అనుభవం, మార్గదర్శకత్వం ద్వారా సమాజాన్ని మార్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన సూచిస్తున్నాడు. ఇది ఒక వ్యక్తిగత విజ్ఞప్తి మాత్రమే కాదు. అది ఒక తరం నుంచి మరో తరానికి వచ్చిన ఆలోచనా మార్పు.

ఒక లేఖ... ఒక కాలపు ప్రతిబింబం

ఈ ఆడియో సందేశం ఒక కుమారుడు తన తండ్రికి రాసిన భావోద్వేగపూరిత లేఖలా అనిపిస్తుంది. కానీ అది అంతకంటే ఎక్కువ. అది మావోయిస్టు ఉద్యమం వంటి దీర్ఘకాలిక రాజకీయ పోరాటాల మానవీయ మూల్యాన్ని గుర్తు చేసే ఒక కదిలించే పత్రం. విప్లవాలు చరిత్రను మార్చవచ్చు. కానీ కొన్ని సందర్భాల్లో ఆ చరిత్ర మార్పు కోసం చెల్లించాల్సిన త్యాగం కుటుంబాలే అవుతాయి..

గణపతి కుమారుడి ఈ మాటలు ఒక వ్యక్తిగత కథ మాత్రమే కాదు. అది ఒక ఉద్యమం, ఒక తరం, ఒక కుటుంబం.. ఈ మూడింటి మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాన్ని మన ముందుంచే భావోద్వేగపూరిత సాక్ష్యం. చివరగా ఆయన చెప్పిన మాటలు ఒక ఆశను వ్యక్తం చేస్తాయి.. తన తండ్రి వంటి అనుభవం, విజ్ఞానం దేశ నిర్మాణానికి ఉపయోగపడితే ఒక కొత్త నవభారతం నిర్మాణం సాధ్యమవుతుందని. అది ఒక కుమారుడి అభిలాష మాత్రమే కాదు. ఒక విప్లవం తర్వాత వచ్చే శాంతి గురించి చెప్పే ఆశ కూడా.

ఖాస్ పాటలకు కేరాఫ్ 'కాసర్ల శ్యామ్'

అంబీర్ శ్రీకాంత్
8185968059

కాసర్ల శ్యామ్.. ఖాస్ పాటలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తూ..సినీదునియాలో 'సౌల్ ఫుల్' ప్లస్ 'శ్రోతలకు ఇంపైన., మస్తు మజా ఇచ్చే మాస్' సాంగ్స్ అందించే లిరిసిస్ట్‌గా దూసుకెళ్తున్నారు. సినిమా పాటకు తెలంగాణ జానపద శైలిని సమకూరుస్తూ.. పల్లె పదాలను పొందుపరుస్తూ.. తనకంటూ ప్రత్యేక గుర్తింపును శ్యామ్ సంపాదించుకున్నారు. తాజాగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్న నాని 'ప్యారడైజ్' చిత్ర 'ఆయా షేర్' గీత రచయిత ఆయనే. తెలంగాణ యాసలో కాసర్ల శ్యామ్ లిరిక్స్ సమకూర్చిన విధానం పాటను ఫుల్ ఫేమస్ చేసింది. ఈ సాంగ్ సక్సెస్ గురించి ఆయన భాషలోనే చెప్పాలంటే.. నెట్టింట పాట ''పొట్టు పొట్టు..'' వైరలవుతోంది. చిత్ర హీరో క్యారెక్టరైజేషన్‌ను విడమర్చి చెప్పేలా హిందీ, ఇంగ్లిష్ పదాలతో పాటు తెలుగు ముఖ్యంగా తెలంగాణ యాసలో వివరించారు. మాస్ హీరోగా ఎలివేషన్‌ను తారస్థాయికి తీసుకెళ్లేలా 'చల్ మావాడొచ్చిండ్రా' అని మొదటి చరణంలోనే చెబుతూ..'జడలురో జడలురో హడలురో ధడలురో..కొడుతరో తొడలురో.. తీస్తారో తోలురో'.. 'మొల్దారం లేనోన్ని..ర.. ఏం పీకుతవుర.. ప్యారడైజ్‌కు అడ్రస్ నైత..' అని కథలో బలమైన కథానాయకుడి పాత్రను సుస్పష్టంగా చెప్పారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ పాటకు జంగిరెడ్డి, దేవయ్య గాత్రం అందించగా, అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ స్పెషల్ అట్రాక్షన్.

కళాకారుల ఖిల్లా ఓరుగల్లు ఖ్యాతి నిలబెడుతూ..

కళాకారుల ఖిల్లా ఓరుగల్లు ఖ్యాతి నిలబెడుతూ.. సినీ దునియాలో మస్తు మంచి పాటలు రాస్తూ..కాసర్ల శ్యామ్ బలంగా ముందుకెళ్తున్నారు. తెలంగాణ యాసలో పల్లె వాతావరణం, అనుబంధాల నేపథ్యంలో 'జబర్దస్త్' వేణు యెల్దండి దర్శకత్వంలో తెరకెక్కిన 'బలగం' చిత్రానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సినిమాలోని 'ఊరు పల్లెటూరు' పాటకుగాను కాసర్ల శ్యామ్‌కు ఉత్తమ గేయ రచయితగా జాతీయ అవార్డు లభించింది. అందరి హృదయాలను హత్తుకునేలా సాహిత్యం అందించిన కాసర్ల శ్యామ్.. తెలుగు చిత్ర సీమ నుంచి జాతీయ అవార్డు అందుకున్న ఐదో గేయ రచయిత కావడం విశేషం. 'మహాత్మ' సినిమాలోని 'నీలపూరి గాజుల ఓ నీలవేణి' అంటూ జానపద బాణితో వచ్చిన పాట సంచలనం కాగా, అటు తర్వాత ఒక్కొక్కటిగా పాటల ప్రయాణం కొనసాగిస్తూ.. అలవైకుంఠపురములో 'రాములో రాములా' అంటూ సినీ ప్రియులను ఆగమాగం చేసి.. ఉర్రూతలూగించాడు. 'బలగం' చిత్రంలో 'ఊరు పల్లెటూరు' పాటతో పాటు 'బలరామ నరసయ్యో', 'పొట్టి పిల్ల' పాటలను అందించారు. ఇక 'దసరా' చిత్రంలో 'చమ్కీల అంగిలేసి ఓ వదినే' అంటూ హనుమకొండ పిలగాడు కాసర్ల శ్యామ్

నెట్టింట ట్రెండ్ సృష్టించారు, 'ధూందాం దోస్తాన్..' అంటూ 'డీజే టిల్లు.. తీరే వేరు' అంటూ ఆయన కలం నుంచి జాలువారిన పాటలన్నీ నెట్టింట ట్రెండ్ అవడమే కాదు సోషల్ మీడియాను షేక్ చేశాయి. ఇటీవల వచ్చిన చాంపియన్ చిత్రంలోని 'గిరగిరగిర గింగిరగిరే' పాట నెట్టింట.. ఇన్‌స్టా రీల్స్‌లో ఫుల్ ఫేమస్ అయింది. 'ఎర్రెర్ర బొట్టు దిద్ది ఎండి మేఘం మెరిసిందే' అంటూ పల్లె వాతావరణం.. ప్రకృతి మధ్య పోలిక, అభివర్ణణ అత్యద్భుతంగా చేశారు. 'పొట్లం గట్టిన బిర్యానీకి బొట్టూ బిళ్ల పెట్టినట్టు', 'ఎన్నెల', సందమామ, గమ్మతి, సెమట సుక్కలు, చెమ్కీలు, చెంటిపోరడు, వంటి చక్కటి తెలంగాణ యాస పల్లెపదాలను దండలో పూలను గుదిగుచ్చినట్లు బంధంగా పేర్చి పేక్షకులను మంత్రముగ్ధులను చేయడం కాసర్ల శ్యామ్ కలం బలమని చెప్పొచ్చు. ఆయన మరిన్ని పాటలను రాస్తూ..సాహితీయజ్ఞం కొనసాగించాలని, జాతీయ అవార్డును మరోసారి సొంతం చేసుకుని తెలుగు వారి సత్తాను మరోసారి చాటాలని ఆకాంక్షిస్తున్నా.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ప్రాంతీయం

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

జిల్లా కలెక్టర్ కే. హైమవతి

ప్రతి పక్షం, దుబ్బాక, మార్చి 04: జిల్లాలోని ఆయిల్ ఫామ్ సాగు అత్యంత లాభదాయకమని, సాగు చేయడానికి పెద్దఎత్తున రైతులు ముందుకు రావాలని, వ్యవసాయ క్షేత్రాలలో వేసిన పంటలే వెయ్యకుండా పంట మార్పిడి చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం దుబ్బాక మండలంలోని దుంపల పల్లి గ్రామంలో ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా రైతు చింత రాజు వ్యవసాయ క్షేత్రంలో 12 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా కలెక్టర్ ఆయిల్ ఫామ్ మొక్కను నాటారు. జిల్లాలో ఇప్పటివరకు 14200 ఎకరాలు ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో రైతులందరూ వరి సాగు మీదనే ఎక్కువ దృష్టి పెడతారని దీనివల్ల నాలుగు నెలల్లో వచ్చే ఆదాయం అనుకున్న దాని కంటే చాలా తక్కువ, రైతులకు ఉండే వ్యవసాయ క్షేత్రంలో కొంత వరి వేసుకొని మిగతా భాగంలో పంట మార్పిడితో కూరగాయలు పండించడం, వివిధ రకాల తోటల పెంపకం, పండ్ల తోటలు, ఆయిల్ ఫాం సాగు చెయ్యాలని తెలిపారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగును ఎక్కువగా ప్రచారం చేస్తుందని రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు ఆయిల్ ఫామ్ మొక్కలను, డ్రిప్పు, మెయింటెనెన్స్ కాస్ట్, ఫామ్పౌండ్స్ ఇలా రకరకాలుగా 50వేల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందనీ రైతులు క్రమంగా మూడు సంవత్సరాలు ఆయిల్ ఫామ్ సాగును చేస్తే నాలుగో సంవత్సరం నుండి ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ మూడు సంవత్సరాల్లో కూడా మొక్క వేళ్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంతర పంటలు వేసుకునే ఆస్కారం కూడా ఉంది. మూడు సంవత్సరాల తర్వాత కూడా అరటి, కోకో వంటి అంతర పంటలు ద్వారా కూడా అదనపు ఆదాయం పొందవచ్చు. ఆయిల్ ఫామ్ వల్ల నెలకు ప్రభుత్వ ఉద్యోగస్తులతో సమానమైన వేతనం రైతులు పొందవచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు వారి పంట సాగు , లాభాల విషయాలను పలువురు రైతులను తెలిపి ప్రోత్సహించాలని, జిల్లా రైతులు పంట మార్పిడి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ వెంట జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సువర్ణ, తహసీల్దార్ సంజీవ్, ఇతర అధికారులు, రైతులు ఉన్నారు.

మధ్యాహ్న బోజనం తనిఖీ

దుబ్బాక మండలం ధర్మారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్నం, ఆలుగడ్డ టమాటా, టమాటా చారు లను పరిశీలించారు. రోజు కామన్ డైట్ మెనూ పాటిస్తూ రుచికరంగా ప్రతి వంట విద్యార్థులకు సరిపోయేవిధంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట ప్రక్రియను ఆహారం రుచికరంగా వండి విద్యార్థులకు పెట్టించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. పాఠశాల మొత్తం కలియ తిరుగుతూ 4 వ తరగతికి వెళ్ళి విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించారు. విద్యార్థులతో పద్యాలను కథలను చదివించి అభినందించారు. పాఠశాలలో మీ సబ్జెక్ట్స్ తో పాటు గ్రంథాలయంలో పలు పుస్తకాలలోని కథలు చదవాలని, కథలలోని సారాంశాన్ని మీ టిచర్ ను అడిగి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పద్యాలు గట్టిగా బిగ్గరగా పలు మార్లు చదివితే కంఠస్థం అవుతుందని తెలిపారు. మధ్యాహ్నం భోజనం బాగా తినాలని చదువుతో పాటు ఆటలు ఆడుకోవాలని తెలిపారు.అనంతరం పాఠశాల ప్రాంగణంలోని అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పిల్లలకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం పెట్టాలని ఆకుకూరలు, మునగాకు, గుడ్లు పెట్టాలని టిచర్ ను ఆదేశించారు.

ఎల్ఎస్ఎం 2 కాలువ పనులు పూర్తిచేసి

రైతులకు సాగు నీరు అందించాలి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 05 : రంగనాయక సాగర్ ఎడమ కాలువ నుండి ఎల్ ఎస్ ఎం టు కాలువ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతులు రంగనాయక సాగర్ నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మాచపూర్ సర్పంచ్ ఈ యాట సత్యలక్ష్మి యాదయ్య, మాజీ ఎంపిటిసి ఎల్లం లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచడానికి కరువు రాకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి కెసిఆర్ హరీష్ రావులు అహర్నిశలు కృషి చేస్తే నమ్మబలికి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి మిగిలిపోయిన కాల్వ పనులు చేయకుండా చివరి రైతుకు సాగునీరు అందకుండా అడ్డుపడుతున్నాడని విమర్శించారు. అధికారులు కూడా పనులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని దీనివల్ల పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలు కావాల్సి వస్తుందని మండిపడ్డారు. దీనివల్ల రైతు కుటుంబంతో పాటుగా రాష్ట్ర ప్రజల మీద ఈ భారం ఉంటుందని ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర నుండి మేల్కొని రంగనాయక సాగర్ కింద మిగిలిన పనులను, మాచాపూర్ గ్రామ ఎల్ ఎస్ ఎం టు కాల్వ పనులు పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించాలని రెండు రోజులలో నీరు అందించకుంటే రైతులందరినీ సమకూర్చి రాజీవ్ రహదారి దిబ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, యాట యాదయ్య, సుంచు ఎల్లం, సుంచు మనోజ్, శ్రీనివాస్, గాజుల ఎల్లయ్య, సుంచు నరసయ్య, కొమ్ము మల్లేష్, సుంచు రాజు, కొయ్యడ నాగరాజు, గాజుల మల్లయ్య, గాజుల చంద్రం, జేరిపోతు రాములు తదితర రైతులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట మార్చి 05: ఎంపీపీ ఎస్ రేణుక నగర్ ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెబురి సరళ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వినయం, వివేకం అవసరమని తెలిపారు. అలాగే ఆటపాటలు, శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కూడా అందించినప్పుడే వారు సంపూర్ణ వ్యక్తిత్వంతో సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తయారవుతారని పేర్కొన్నారు. స్వయం పరిపాలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ బాధ్యతలు చేపట్టారు. అఖిల్ డీఈఓగా, శివప్రసాద్ ఎంఈఓగా, సుమన్ హెడ్‌మాస్టర్‌గా బాధ్యతలు నిర్వహించగా, ఇతర విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఐ. కిష్టయ్య, కె. పద్మ పర్యవేక్షణ చేశారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో బెనిఫిట్..

నామినీకి రూ.19.53 లక్షలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 5: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ ఇచ్చే ప్రయోజనకరమైన పథకమని పోస్టల్ అధికారులు తెలిపారు.సిద్దిపేట హెడ్ పోస్టాఫీసులో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్న నంగనూరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన అల్లూరి తిరుపతిరెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఆయన రూ.15 లక్షల విలువ గల రెండు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకుని సుమారు రూ.2 లక్షల వరకు ప్రీమియం చెల్లించారు.ఆయన మరణం అనంతరం నామినీగా ఉన్న భార్య అల్లూరి అఖిల క్లెయిమ్ చేయగా, పాలసీ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షల పాలసీపై రూ.19 లక్షల 53 వేల రూపాయలు మంజూరయ్యాయి.సిద్దిపేట హెడ్ పోస్టాఫీసులో గురువారం పోస్టుమాస్టర్ కరుణాకర్ రెడ్డి, డిప్యూటీ పోస్టుమాస్టర్ డి. శ్రీనివాస్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ రాజేందర్ రెడ్డి చెక్కులను అల్లూరి అఖిలకు అందజేశారు.ఈ సందర్భంగా పోస్టల్ అధికారులు మాట్లాడుతూ డిగ్రీ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలతో పోలిస్తే తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ లభిస్తుందని తెలిపారు. చిన్న వయసులో పాలసీ తీసుకుంటే ప్రీమియం కూడా తక్కువగా ఉంటుందని వివరించారు.చెక్కులు స్వీకరించిన అల్లూరి అఖిల పోస్టాఫీసు సిబ్బంది త్వరితగతిన క్లెయిమ్ మంజూరు చేసినందుకు పోస్టల్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ఈడి లైట్లతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం

సగం లైట్ స్టిక్కర్ నిబంధన జాడలేదు

ప్రతిపక్షం గజ్వేల్, మార్చ్ 05: చీకటి అయిందంటే వాహనాలు నడపాలంటే ఎదురొచ్చే వాహనాల మెర్క్యూరీ (ఎల్ఈడి) లైట్ల వెలుతురు వల్ల కళ్లు కనిపించకుండ పోయి రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్నాయని పలువురు ద్విచక్ర వాహన చోదకులు వాపోతున్నారు.కొత్తగా వచ్చే వాహనాల కు ఆర్టీవో అధికారుల పర్యవేక్షణ కరువై వాహన యజమానులు, యువకులు వారి ఇష్టారికెన వాహనాలకు ఫోకస్ లైట్లు బిగించుకొని ప్రయాణం చేయడం ఎదుటి ప్రయాణికుని ప్రాణాలకు ఫణంగా మారుతున్నాయని చెప్పొచ్చు. గతం లో వాహనాల హెడ్ లైట్ కు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ ఉండాలి అన్న నిబంధన ఉండేది. ఆ నిబంధనలను విస్మరించి ఎల్ఇడి లైట్ ల వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక, కళ్ళు మసకబారి ఏమీ కనపడకుండా పోయి. ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కనుక సంబంధిత అధికారులు వాహనాల హెడ్ లైట్స్ ల కు వస్తున్న ఎల్ఈడి దీపాల గురించి చర్య తీసుకొని కనీసం హెడ్ లైట్ల కు సగం వరకు నల్లటి స్టిక్కర్ కానీ, పెయింట్ కానీ వేయాలనే రూల్ ను పునరుద్దరించాలి అని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్చి 6 నుంచి జూన్ 12 వరకు

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

అయిదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్
జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 05 : మార్చి 6వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన.ప్రగతి ప్రణాళికలు కార్యాచరణ అమలుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, హోం, రవాణా, వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమ, హౌసింగ్, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అయిదు దశల్లో అమలు చేయనున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ క్షుణ్ణంగా వివరించారు.ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజా సమస్యలను పరిష్కరించడం, సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి-పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం - ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.మహిళా సంఘాల రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తిగా సాధించాలని, తక్కువ వసూళ్లు ఉన్న మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల స్థాపన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, శ్రీనిధి రుణాల 100 శాతం వసూళ్లపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతర పర్యవేక్షణలో ఉంచి వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణ పూర్తి బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర వివరాలు సమగ్రంగా నివేదికలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, అదనపు ఎస్పీ మహేందర్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని దౌల్తాబాద్ తహసీల్దార్, కార్యాలయం సిబ్బంది

ప్రతి పక్షం, దౌల్తాబాద్, మార్చి 5: దౌల్తాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సమయం 11 గడిచిన తహసిల్దార్, డీటీ ఇతర సిబ్బంది కార్యాలయానికి సమయానికి చేరుకోలేదు. కార్యాలయం పని సమయం ఉదయం నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా, తహసీల్దార్, డీటీ సహా ఇతర సిబ్బంది తరచూ ఆలస్యంగా కార్యాలయానికి చేరుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలా రోజులుగా ఇదే తంతు కొనసాగుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి రోజు భూ సమస్యల పరిష్కారం కోసం దూరదూర ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని తెలిపారు. ఉదయం సమయానికి అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజల పనులు ఆలస్యమవుతున్నాయని, తమ భూ సమస్యలు ఎక్కడివక్కడే నిలిచిపోతున్నాయని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సమయపాలన కచ్చితంగా అమలు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నిరుపేద యువతి పెళ్లికి పుస్తె, మెట్టెల అందజేత

ప్రతిపక్షం,నంగునూరు, మార్చి 5 : నంగునూరు మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం రాగుల లక్ష్మి, మైసయ్య దంపతుల కుమార్తె స్రవంతి వివాహం గురువారం జరిగింది. స్రవంతి వివాహానికి నంగునూరుకు చెందిన ఫణిరాజు ఆర్థిక సహాయంతో పుస్తె మెట్టెలను టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి గురువారం స్రవంతి తల్లిదండ్రులు లక్ష్మి, మైసయ్యలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి, రాగుల కనకయ్య, అన రాజు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ గవర్నర్ పదవికి ఆనంద్ బోస్ రాజీనామా చేయడం షాక్‌కు గురి చేసింది. ఆయన రిజైన్ వెనుక కారణం తెలియదు. కానీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం గవర్నర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడి చేసి ఉంటారు. ఎన్. రవిని బెంగాల్‌గవర్నర్‌గా నియమిస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఈ విషయంలో నాతో చర్చించలేదు. ఇలాంటి చర్యలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తాయి.
- సీఎం మమతా బెనర్జీ

ప్రాంతీయం

ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని
పగడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, మార్చి 05 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులకు ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జూమ్ సమావేశం ద్వారా ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్ ఏఈలు, ఏపీఎంలకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ శాఖలకు కేటాయించిన పనులను వారికి నిర్దేశించిన వారాల్లోనే పూర్తి చేయడంతో పాటు 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అయిన విద్య,వైద్యం, వనమహోత్సవం, తాగునీటి సరఫరా, సన్న బియ్యం, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహలక్ష్మి, రూ.500 గ్యాస్ సబ్సిడీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, హాస్టళ్లలో డైట్ ఛార్జీల పెంపు, పారిశుధ్యం వంటి పథకాల వివరాలను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాలను ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రస్తుతం రూఫ్ స్థాయిలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ ఏడాది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూరి గుడిసెల్లో నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ నెల మొత్తం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను పూర్తి చేస్తూనే ప్రజాపాలన కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల శాతం పెంచేందుకు కృషి చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. మాస్టర్ జనరేషన్‌లో సమస్యలు ఎదురైతే వెంటనే స్పందిస్తూ రోజువారీగా పర్యవేక్షించాలని డిఆర్డీఓ జయదేవ్ ఆర్యను ఆదేశించారు.

పెద్ద మాసన్‌పల్లిలో వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభం

ప్రతిపక్షం, తొగుట, మార్చి 05 : మండల పరిధిలోని పెద్ద మాసన్ పల్లి గ్రామంలో నూతనంగా వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ పన్యాల ప్రవీణ్ రెడ్డి తెలిపారు.గ్రామ ప్రజలకు సమీపంలోనే ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ వ్యాక్సినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలోనే ఒక గదిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు , గ్రామ ప్రజలు అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ప్రభుత్వ అందిస్తున్న టీకాలను, బీపీ.షుగర్ పరీక్షల కోసం గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచడానికి గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయిని శ్రీనివాస్. ఏఎన్ఎం కృష్ణవేణి. ఆశాకార్యకర్తలు నసియా బేగం, సాజిదా బేగం, అంగన్వాడి టీచర్లు , వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను వర్తింపజేయాలి

తపస్ నంగునూరు మండల అధ్యక్షుడు కత్తుల రాంరెడ్డి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 5 : కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబర్ 57/4 మరియు 57/5 ప్రకారము 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రభుత్వం తక్షణమే పాత పింఛను విధానం వర్తింపజేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు కత్తుల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న మహా విజ్ఞాపన సభకు మద్దతు కోరిన 2003 డీ ఎస్సీ ఉపాధ్యాయులకు సంఘీభావం గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ2003 ఉపాధ్యాయులను అన్యాయంగా నూతన పింఛను విధానంలోకి తీసుకు వచ్చారని విమర్శించారు. ఇరవై సంవత్సరాలుగా డీ ఎస్సీ 2023 ఉపాధ్యాయులు ఎన్నో న్యాయ పోరాటాలు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు 2003 డీఎస్సీ వారికి పాత పింఛను విధానం వర్తింప చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. తక్షణమే 2003 ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పింఛను విధానం వర్తింప చేసి, జీపీఎఫ్ నెంబర్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పింఛను విధానం వర్తింప చేయడానికి అవసరమయ్యే న్యాయపోరాటానికి తపస్ మద్దతు ఇస్తుందని చెప్పారు. ఈ అంశంపై ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు తక్షణమే నివేదిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు గడీల శ్రీకాంత్, అనుముల వీరేశం, పయ్యావుల జైపాల్ యాదవ్ , సింగిరెడ్డి రమణా రెడ్డి, నిమ్మ భాస్కర్ రెడ్డి మెరుగు వెంకటేశ్, మహదేవ్, రామకృష్ణ, నారాయణరెడ్డి, కొత్తపల్లి రవి, మట్ట శ్రీకాంత రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి వివాహ సహాయం

ప్రతిపక్షం చేర్యాల, మార్చి 05 : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబమైన తరిగొప్పుల సిద్ధులు -ఆనసూర్య దంపతుల రెండవ కుమార్తె వివాహానికి గ్రామానికి చెందిన దాతలు సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎన్ ఆర్ ఐ నూనె (ఉత్కం) కవిత పూస్తే మట్టెలను అందజేశారు.అలాగే ఆమె తమ్ముడు ఉత్కం భానుచందర్ గౌడ్ రూ.2000 నగదు సహాయాన్ని ఈరోజు అందజేశారు.ఈ కార్యక్రమంలో మిల్లాపురం వరేష్, ముస్కు శ్రీకాంత్, రమేష్ చారి, మొగుళ్ళ భాస్కర్, సాతెల్లి సుధాకర్, చింతల పవన్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల కోసం ఇబ్బందులు

- మంచినీటిని సరఫరా చేయడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- భగీరథ నీటి సరఫరా రెండు రోజులు బంద్
- నిర్లక్ష్యం నీడలో మున్సిపల్ అధికారులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 05: వేసవి కాలం ను దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్యల పరిష్కారానికై సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారీకి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిషన్ భగీరథ. గ్రిడ్ అధికారులు పట్టణంతోపాటు వివిధ గ్రామాలలో రెండు రోజులపాటు మంచినీటి సరఫరా బంద్ చేయడం జరుగుతుందని ముందస్తుగానే సమాచారం ఇచ్చిన మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పట్టణంలో ఉదయం సకాలంలో వాటర్ అందించలేకపోయారు. ఉదయం మంచి నీళ్లు రాకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భగీరథ అధికారులు ముందస్తుగానే సమాచారం ఇచ్చినప్పటికీ మెదక్ మున్సిపల్ లో గల వాటర్ ట్యాంకర్లను సిద్ధం చేసుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో సమస్య జటిలమైంది. మున్సిపల్ పరిధిలో 32 వార్డులలో కేవలం మూడు వాటర్ ట్యాంకులు ఉండడం వాటి ద్వారా మంచినీటి సరఫరా చేయడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు ఉదయం రావలసిన మంచి నీళ్లు. మధ్యాహ్నం 12 గంటల వరకు మంచి నీటి ఉంది ట్యాంకర్లు రాకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు 32 వార్డులలో కేవలం మూడు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా ఎలా సాధ్యమైతుందనేది మున్సిపల్ అధికారులకు పాలకవర్గానికే తెలియాలి...? మెదక్ మున్సిపల్ పరిధిలో ఒక వంద డెబ్బై బోరు బావులు ఉన్నప్పటికీ వాటి ద్వారా వార్డులలో ప్రజలు నీటి సమస్య తీరేది కాదు. బోరు బావులు ఉన్నచోటనే పట్టణ ప్రజలకు సకాలంలో నీరు అందించలేకపోయారు. ముఖ్యంగా వేసవికాలం రంజాన్ ఉపవాస దీక్షలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ పరిధిలోని రెండు రోజులపాటు భగీరథ మంచినీటి సరఫరా ఉండదని అధికారులు ప్రకటించిన ముందస్తుగానే మూడు ట్యాంకర్లను సిద్ధం చేసుకోలేకపోయారు. పట్టణ ప్రజలు స్థానిక కౌన్సిలర్లకు మంచినీళ్లు రావడం లేదు ట్యాంకర్లు కావాలి సమాచారం అందిస్తే అధికారులు అప్పటికప్పుడు మున్సిపల్ ట్యాంకర్లను సిద్ధం చేసుకోవడం జరిగింది ఇన్ని రోజులుగా భగీరథ మంచిది నీటి సరఫరా ఉండడం ట్యాంకర్ల వాడకం తక్కువగా ఉండడంతో వాటిని వాడకపోవడంతో టైర్లలో గాలి లేకపోవడం చిన్నచిన్న రిపేర్లు ఉండటంతో పట్టించుకునే నాధుడే కరువయ్యారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు హటాహోటిన మెదక్ మున్సిపల్ చేరుకొని మూడు ట్యాంకర్ల ద్వారా పట్టణ ప్రజలకు నీటి సమస్యను పరిష్కరించారు. ఇప్పటికైనా మెదక్ పట్టణ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటే ప్రత్యమ్మయ మార్గాలు కేవలం 3 ట్యాంకర్ల ద్వారా నీటి నీ సరఫరా చేయడం సాధ్యం కాదని విషయాన్ని గ్రహించి పట్టణ ప్రజలకు సమస్యను తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత నేటి పాలకవర్గానికి ఉంటుందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు. సింగూర్ డ్యాం మరమ్మత్తుల దృష్ట్యా మంచినీటి సరఫరా విషయమై ఇబ్బందుల గురవుతామని తెలిసిన మున్సిపల్ అధికారులు ముందస్తుగా ప్రత్యమ్మే చర్యలు తీసుకోకపోవడం మూలంగానే ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి అన్నారు. మంచినీటి సరఫరా లో ప్రత్యమ్మయ్య చర్యలు తీసుకోకుండా కేవలం 3 ట్యాంకర్ల ద్వారా 32 వార్డులలో నీటి ఎలా సరఫరా చేస్తారు.? ముందే వేసవికాలం ఆపై ముస్లింలకు ఉపవాస దీక్షలు ఉండడంతో మంచినీటి సరఫరాను సకాలంలో అందించాలని ఆయన తెలిపారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

సొసైటీ మాజీ చైర్మన్ హరికృష్ణ రెడ్డి

ప్రతిపక్షం, తొగుట, మార్చ్ 5 : అకాల వర్షం కురిసి వారం రోజులు గడుస్తున్నా రైతులకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందకపోవడం చాలా బాధాకరమని తొగుట మండలంలోని గుడిగందుల గ్రామంలోని గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సొసైటీ మాజీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు.అకాల వర్షంతో నష్టపోయిన పంటలను అంచనా వేసి వెంటనే రైతులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు.పంట నష్టానికి సంబంధించి ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సిద్దిపేట జిల్లాను అభివృద్ధి,సంక్షేమంలో చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు.రైతులకు అవసరమైన యూరియాను ఎలాంటి ఆంక్షలు లేకుండా అందించాలని కోరారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ పర్శయ్య,భూపాల్ రెడ్డి, చంద్రారెడ్డి, పర్శయ్య, గోపాల్ రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

మహిళలకు సమాజంలో రక్షణ కల్పించాలి

మహిళా సంఘం అధ్యక్షురాలు అరుణ జ్యోతి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 05: మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో మహిళా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మెదక్ కేవల్ కిషన్ భవన్ లో 115 వ మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి మాట్లాడుతూ 18వ శతాబ్దం నుండి మహిళల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తేనే మహిళా దినోత్సవం అమల్లోకి వచ్చిందని అన్నారు. అమెరికా లోని న్యూయార్క్ సోషలిస్ట్ అమెరికా లో మహిళా దినోత్సవం జరిగిందన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో అమెరికాలోని న్యూయార్క్ ప్రాంతంలో పనిగంటల కోసం పోరాటం బ్రెడ్ కోసం పోరాటం జరిగిందన్నారు ప్రదర్శనలో మహిళలపై దాడి జరిపి 146 నిర్బంధ గుహలో వేసి బంధిస్తూ చనిపోయారని గుర్తు చేశారు. 1917లో రష్యాలో చేసిన పోరాటాల ఫలితంగా రష్యాలో విప్లవం వచ్చిందన్నారు. రష్యాలో పోరాటాల ఫలితంగా మహిళలకు,కార్మికులకు హక్కులు కల్పించబడ్డాయనీ అన్నారు.8 గంటల పనిని సాధించారన్నారు.రష్యా ప్రభుత్వం ఆనాడు మహిళలకు,మహిళల శ్రమను గుర్తించి సామూహిక లాండ్రీలు క్షేత్రాలు కట్టించింది అన్నారు సామూహిక వ్యవసాయ క్షేత్రాలు పరిశ్రమలు పరిశ్రమలలో సామూహిక ఖర్చులు ఏర్పాటు చేసిందన్నారు. మహిళలు తమ కుటుంబ బాధ్యతలు చూస్తూనే ఉత్పత్తి రంగంలో, ఇతర పనులలో సమాజానికి సేవలు అందించారన్నారు. స్వాతంత్రం కోసం పోరాటాలు చేసిన మల్ల స్వరాజ్యం ఆరుట్ల కమలాదేవి లాంటివారు అనేకమంది మహిళలే పోరాడారన్నారు ఆనాడు విద్య కోసం సావిత్రి జ్యోతిబా పూలే పోరాడితేనే ఈనాడు మహిళలకు విద్యను అందిస్తున్నారన్నారు 1975 సంవత్సరంలో మహిళా దినోత్సవం సాధికారత అవసరమని ఐక్యరాజ్యసమితి గుర్తించి అమల్లోకి తెచ్చింది అన్నారు. దేశంలో మహిళ లు,చిన్న పిల్లల పై అత్యాచారాలు జరుగుతున్న సంఖ్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.పాలక ప్రభుత్వాలు మహిళల ప్రాథమిక హక్కులు లేకుండా చేస్తున్నానన్నారు.మంత్రి పార్లమెంటు సభ్యుల స్థాయిలో ఉన్నవారు కూడా మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరించడం అత్యాచారాలకు పాల్పడడం లాంటి దుర్ఘటనలు మనదేశంలో ఉన్నాయన్నారు. స్కీమ్ వర్కర్లలో మహిళల కార్మికులు గా ఉన్న వారికి పెరుతున్న ధరలకు అనుకూలంగా జీతాలు పెంచడం లేదన్నారు.కుటుంబ భారం నిర్వహణ కోసం తక్కువ వేతనాలకే ఉద్యోగాలు, పనులు నిర్వహిస్తున్నారన్నారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోకుండా కుటుంబం కోసం భోజనం చేసి కుటుంబాన్ని నిర్వహణ చేస్తున్నారన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ,జీవించే హక్కు స్వేచ్ఛ స్వతంత్రం పొందే హక్కులపై దాడి చేస్తున్నదన్నారు.మహిళా అనే వ్యక్తి ఎప్పుడూ ఒకరికి లోబడి ఉండాలని చుస్తుందన్నారు.

మహిళకు కూడా మనిసే తాను మగవాళ్ల తోసమానంగా అన్ని రంగాలలో ముందుంటున్నారు.ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవిత మాట్లాడుతూ మహిళా తన కుటుంబం కోసం,సమాజం కోసం సమానంగా కష్ట పడి పని చేస్తుందని అన్నారు.మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు సంవత్సరం పాటు అమలయ్యేలా చూడాలన్నారు.కేవలం మహిళా దినోత్సవం రోజు మాత్రమే పాలకులు మహిళల గురించి మాట్లాడి తే సరిపోదని, మహిళా సాధికారత కోసం పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి కే నరసింహ జిల్లా కన్వీనర్ నాగమణి, జిల్లా నాయకులు కవిత వైశాఖ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పాల్గొన్నారు

పరిశుభ్రత పారిశుద్ధ్యంపై
వీడియో కాన్ఫరెన్స్

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 5: ఈనెల ఆరవ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహించే పరిసరాల పరిశుభ్రత పారిశుద్ధ్యం కార్యక్రమం పై చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి తహసిల్దార్ శివప్రసాద్ వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ మండల పంచాయతీ అధికారి విజయపాల్ మిషన్ భగీరథ ఏఈ దివ్య హౌసింగ్ ఏఈ రియాజుద్దీన్ సీనియర్ అసిస్టెంట్ మడిగల శ్రీశైలం వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోర్టు ముందు
న్యాయవాదుల నిరసన

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 05 : మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదం విషయమై పాపన్నపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన న్యాయవాదిపై చేయి చేసుకొని దుర్భసలాడిన పాపన్నపేట ఎస్సై పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం మెదక్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్కంటి రాములు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదానికి సంబంధించిన ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన తమ సహచర న్యాయవాది సతీష్ పై పాపన్నపేట ఎస్సై దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నాడని తీవ్రంగా ఖండించారు. తాను న్యాయవాదినని పరిచయం చేసుకున్నప్పటికీ, ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన వ్యక్తిపై ఇలా ప్రవర్తించడం దుర్మార్గమైన చర్య అని ఆయన అన్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.దాడికి పాల్పడిన ఎస్సైపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు న్యాయవాద వృత్తులను బహిష్కరిస్తూ నిరసన కొనసాగిస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు. జనార్దన్ రెడ్డి.మాయ వెంకటేశం.జీవన్ రావు. కిరణ్ గౌడ్, ఫజల్ అలీ, రవీందర్, రామ శర్మ తదితరులు పాల్గొన్నారు

"హిందూ మహాసముద్రంలో ఇరాన్ నౌకపై అమెరికా దాడి చేయడం దురదృష్టకరం. ఇండియాలో నేవీ విన్యాసాల అనంతరం వెళ్తున్న షిప్‌పై దాడి చేశారు. వాళ్లు మన అతిథులు. ఈ వ్యవహారంలో మన దేశాన్నీ లాగుతున్నారు. కశ్మీర్‌లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొందరు యత్నిస్తున్నారు. వాళ్లను సహించబోం.

- జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

ప్రాంతీయం



ప్రశ్నే పురోగతికి సోపానం

- సీసీఎంబీ పూర్వ డైరెక్టర్ మోహన్ రావు
- గీతంలో జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 05 : ప్రశ్నించే స్ఫూర్తి, ఉత్సుకత శాస్త్రీయ పురోగతికి సోపానాలని బిట్స్ పిలాని హైదరాబాదు బయోలాజికల్ సైన్సెస్ విభాగాధిపతి, సీనియర్ ప్రొఫెసర్ ఎమెరిటస్, హైదరాబాదులోని సెల్యులార్, మాలిక్యులర్ బయాలజీ కేంద్రం (సీసీఎంబీ) పూర్వ డైరెక్టర్ సీహెచ్. మోహన్ రావు అన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గురువారం ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కీలకోపన్యాసం చేశారు. సర్ సి.వి. రామన్ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, భారతదేశం అపారమైన జ్ఞానం, ప్రతిభను కలిగి ఉన్నప్పటికీ, వాస్తవ ప్రపంచ సమస్యలకు జ్ఞానాన్ని అనుసంధానించడంలో విఫలమవుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. పరిశీలన, విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణలను విద్యార్థులు పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. దేశం యొక్క శాస్త్రీయ వృద్ధికి అర్థవంతంగా దోహదపడటానికి పరిశోధన అవకాశాలు, ఫెలోషిప్ లు, డాక్టోరల్ అధ్యయనాలను చురుకుగా చేపట్టాలని డాక్టర్ మోహన్ రావు హితవు పలికారు. 'సైన్స్ లో భారతీయ మహిళలు - వికసిత్ భారత్ ను ఉత్ప్రేరకపరచడం' అనే స్ఫూర్తిదాయకమైన ఇతివృత్తంతో, దేశ శాస్త్రీయ పురోగతిని రూపొందించడంలో పరివర్తనాత్మక పాత్ర పోషించిన మార్గదర్శక భారతీయ మహిళా శాస్త్రవేత్తల విశేష కృషిని గౌరవించేందుకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మొక్కల సైటోజెనెటిక్స్ లో తన మార్గదర్శక కృషికి పేరుగాంచిన ప్రముఖ వృక్షశాస్త్రజ్ఞురాలు ఎడవలేత్ కక్కట్ జానకి అమ్మాల్; 19వ శతాబ్దంలో, సామాజిక అడ్డంకులను ఛేదించి మనదేశపు భారతదేశపు మొట్టమొదటి మహిళా వైద్యురాలిగా నిలిచిన ఆనందిబాయి గోపాల్ రావ్ జోషి; సేంద్రీయ రసాయన శాస్త్రానికి చేసిన అద్భుతమైన కృషికి భారతీయ విశ్వవిద్యాలయం నుంచి సైన్స్ డాక్టరేట్ పొందిన తొలి మహిళ అసిమా ఛటర్జీ; భారతదేశంలో వాతావరణం, వాతావరణ పరిశోధనలను గణనీయంగా అభివృద్ధి చేసిన అన్నా మణి వంటి విశిష్ట మహిళా శాస్త్రవేత్తలకు ఈ వేడుకలలో నివాళులర్పించారు. తొలుత, ప్రొఫెసర్ మోహన్ రావు గీతంలోని ప్రతిష్టాత్మక మూర్తి ల్యాబ్ (అనువాద చొరవలపై బహుళ విభాగ పరిశోధనా విభాగం)ను సందర్శించారు. సహకార పరిశోధన ద్వారా ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సవాళ్లను పరిష్కరించే క్రాస్‌డిసిప్లినరీ థింక్ ట్యాంక్ గా పనిచేయడం దీని లక్ష్యం. ఈ సందర్శనలో భాగంగా, డాక్టర్ మోహన్ రావు బయోటెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్ లాబొరేటరీని కూడా ప్రారంభించారు. ఆ తరువాత లైఫ్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఫార్మసీ విభాగాల అధ్యాపకులతో ముఖాముఖి చర్చించారు. ఈ కార్యక్రమంలో గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం విశిష్ట ఆచార్యులు డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, డాక్టర్ బి.వి.ఆర్.టాటా, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. సెయింట్ ఆన్స్, సెయింట్ జోసెఫ్, స్ఫూర్తి, ప్రగతి డిగ్రీ కళాశాలల నుంచి 500 మంది డిగ్రీ విద్యార్థులు ఈ జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భారతదేశపు మార్గదర్శక మహిళా శాస్త్రవేత్తల వారసత్వాన్ని ప్రతిబింబించడానికి, అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం యొక్క దార్శనికతకు దోహదపడటానికి, వారి నిబద్ధతను పురుద్ఘాటించడానికి ఈ వేడుకలు విద్యార్థులకు ఒక శక్తివంతమైన వేదికను అందించాయి. స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పరిశీలన

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 5 : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం 18వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్ , అరుణ రామకృష్ణ, సీనియర్ నాయకులు కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పనుల పురోగతిని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. స్థానిక ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ ఈ పనులు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికపై సమావేశం

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 5: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణపై నేడు ఉదయం 10:00 గంటలకు మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయం, అజీజ్ నగర్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాకీర్ హమ్మద్ తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపాలిటీ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్‌తో పాటు వార్డు కౌన్సిలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యచరణలో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించాల్సిన సేవలు , అమలు విధానాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

నూతన జిజిహెచ్ నిర్మాణం

- స్పోర్ట్స్ వసతుల అభివృద్ధిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 05 : జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచే లక్ష్యంతో నిర్మించబడుతున్న 273 కోట్ల విలువైన నూతన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జిజిహెచ్ ఆసుపత్రి నిర్మాణ పనులు , మెడికల్ కళాశాల లో స్పోర్ట్స్ పనులను సమీక్షిస్తూ అధికారులను పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణ పనుల్లో త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు . పాత భవనం లో ఉన్న వంద పడకలను , టీ-హబ్బు ను రిలొకేట్ చేసి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు . అనంతరం మెడికల్ కళాశాలలో జరుగుతున్న క్రీడా అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. సిఎస్ఆర్ నిధులతో నిర్మాణం జరుగుతున్న ఈ స్పోర్ట్స్ సదుపాయాలను మూడు నెలల్లోపు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల శారీరకాభివృద్ధికి, ఆరోగ్య పరిరక్షణకు, క్రీడా ప్రతిభ పెంపొందించడానికి ఈ సదుపాయాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. జి జి హెచ్ లోని యుడీఐడి వార్డు ను కేన్సర్ డే కేర్ సెంటర్‌ను కూడా కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు . జిల్లాలో వైద్య సేవల స్థాయిని మరింత ఉన్నతంగా తీసుకెళ్లేందుకు విభాగాలు సమన్వయంతో విధులు నిర్వహించాలని వైద్యాధికారులకు కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటిస్తూ, నిర్ణీత కాలానికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 05 : బోధన్ పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బోధన్ లోని విజేత జూనియర్ కళాశాల, ఉషోదయ, విద్యా వికాస్ జూనియర్ కాలేజీలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు జరుగుతున్నాయా లేదా అని గమనించారు. పలు కేంద్రాలలో లోపాలను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోధన్ పట్టణంలోని అన్ని పరీక్షా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి తనకు వివరాలు తెలియజేయాలని డీ.ఐ.ఈ.ఓ రవికుమార్ ను ఆదేశించారు.

గురువారం ఫస్టియర్ గణితం 1బి, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్ష జరుగగా, ఆయా కేంద్రాలలో పరీక్షలకు గైర్హాజర్ అయిన విద్యార్థుల సంఖ్య గురించి కలెక్టర్ ఆరా తీశారు. విజేత జూనియర్ కళాశాలలో మొత్తం 441 మందికి గాను 12మంది గైర్హాజర్ అయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ స్వర్ణలత తెలిపారు. ఉషోదయ కాలేజీలోని సెంటర్ లో 358 మందికి గాను 21 మంది హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ అనిల్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే, విద్యా వికాస్ జూనియర్ కాలేజీ లోని సెంటర్ లో 406 మంది విద్యార్థులకు 398మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజర్ అయినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రవీందర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు కూడా సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తేకుండా, కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బాలికలను మహిళా సిబ్బంది తనిఖీ చేసే ప్రక్రియకు సహకారం అందించాలని ఏ ఎన్.ఎం లకు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పక్కాగా పరీక్షలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

విద్యా కమిషన్ రిపోర్టును ప్రజలల్లో చర్చించాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 05 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమగ్రమైన విద్యా విధానాన్ని తయారు చేయడానికి 2024 సెప్టెంబర్ లో తెలంగాణ విద్యా కమిషన్ ని నియమించింది. ఆ కమిషన్ "తెలంగాణ కొరకు విద్యా విధానం 2026" పేరుతో ముఖ్యమంత్రికి ఫిబ్రవరి 26 నాడు నివేదిక ను సమర్పించింది. కమిషన్ ఇచ్చిన ఈ రిపోర్టును కనీసం మూడు నెలల పాటు రాష్ట్ర ప్రజల ముందు చర్చకు పెట్టి తుది రూపం ఇవ్వాలని విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్ర సహ అధ్యక్షులు వై. అశోక్ కుమార్, సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు డి.అంజయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సోమశేఖర్, అనుముల రాంచందర్, అసోసియేట్ అధ్యక్షులు ఎం. సంజీవయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి కె. నర్సింలు, ఉపాధ్యక్షులు మల్లికార్జున్ పాటిల్, బంగారు కృష్ణ, ఆర్. లక్ష్మి, ఏ. మానస, కార్యదర్శులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమిషన్లు గానీ కమిటీలు గాని ఒక విద్యా విధానాన్ని రూపొందించడానికి సంబంధితుల నుండి విస్తృత అభిప్రాయ సేకరణ చేసినప్పటికి, అది పాక్షికమే అవుతుంది తప్ప సమగ్రత కాదు. అందుకని తమ రిపోర్టును ప్రజలలో ప్రత్యేకంగా సంబంధిత ప్రజానీకంలో చర్చకు పెట్టే సాంప్రదాయం ఉండేదని వారు అన్నారు. జాతీయ విద్యా విధానం 1986ను రూపొందించేటప్పుడు "విద్యారంగంలో సవాళ్లు" అనే (ఛాలెంజెస్ అఫ్ ఎడ్యుకేషన్) డ్రాఫ్ట్ పెట్టి ప్రజల నుండి ప్రత్యేకంగా విద్యావేత్తలు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి సలహాలు, సూచనలు కోరడం జరిగింది. రెండు సంవత్సరాల వరకు ఈ చర్చ కొనసాగింది. ఆ సూచనలు, సలహాల వెలుగులో ఆ విధానానికి తుది రూపం ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా వివిధ సంఘాల, సెక్షన్ల అభిప్రాయాలను కూడా అప్పటి మంత్రిత్వ శాఖ ప్రత్యేక బుక్లెట్స్ రూపంలో ప్రచురించింది. తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్టును విలువరించిన కొద్ది గంటల్లోనే నివేదికలోని లోపాలు, అనుకూల అంశాలు మీడియాలో చర్చించ బడుచున్నాయని, అందులో విద్యారంగ అనుకూల విషయాలు కూడా అనేకం ఉన్నప్పటికి అంతగా చర్చకు రాలేదని వారన్నారు. అందువల్ల మొత్తం నివేదికను తెలుగులోకి మార్చి ప్రజలందరికి అందుబాటులో ఉంచి, రాష్ట్ర ప్రజలల్లో ప్రత్యేకంగా తల్లిదండ్రులలో, ఉపాధ్యాయులలో, అధ్యాపకులలో, విద్యార్థులలో చర్చకు పెట్టి ఆ సూచనల, సలహాలు, విమర్శల వెలుగులో తుదిరూపం ఇవ్వవలసిన అవసరం ఉన్నది. అందు కొరకు కమిషన్ రిపోర్ట్ ను కనీసం మూడు నెలల పాటు రాష్ట్ర ప్రజలలో చర్చకు పెట్టాలని సంగారెడ్డి జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.



తారా కళాశాలలో జాతీయ సదస్సు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 05 : తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో జీవ శాస్త్రము, కంప్యూటర్ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును "ది ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్స్ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, బయోలాజికల్ రీసెర్చ్ అనే అంశముపై నిర్వహించడం జరుగుచున్నదని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ప్రవీణ తెలిపినారు. ఈ సదస్సు మొదటి రోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం సంయుక్త డైరెక్టర్లు ప్రొఫెసర్ . బాలాభాస్కర్ మరియు ప్రొఫెసర్ . రాజేందర్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరై, జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్ను రిలీజ్ చేయడం జరిగిందని తెలిపినారు. కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ మరియు ప్రొఫెసర్ బాలభాస్కర్లు మాట్లాడుతూ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించడం సంతోషమని ఈ సదస్సుకు ఎంపిక చేయబడిన అంశము జీవశాస్త్రములో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉందని సాంకేతిక సెషన్లలో వచ్చే నిపుణులు వారి సూచనలను దృష్టిలో ఉంచుకొని సదస్సును విజయవంతం చేయాలని కోరినారు. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రధాన కళాశాలలో తారా ప్రభుత్వ కళాశాల ఒకటని ఈ కళాశాల అభివృద్ధికి కావలసిన పూర్తి సహకారాలను అందిస్తామని పేర్కొన్నారు. ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా మొదటి రోజు జరిగిన టెక్నికల్ సెషన్లలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ మంజరి కిరణ్ "సిస్టమ్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ అనే అంశంపై, డా . శశి కిరణ్ , అసిస్టెంట్ ప్రొఫెసర్, బయోకెమిస్ట్రీ ఆధునిక కాలములో జీవశాస్త్రము పై దాని ప్రభావము అనే అంశముపై, జవహర్లాల్ నెహ్రూ టెక్నోలజికల్ విశ్వవిద్యాలయము, సుల్తాన్పూర్ ప్రిన్సిపల్ మరియు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి డా.ఎస్ . విశ్వనాథ మాట్లాడుతూ ఆధునిక పరిశోధనలన్నీ ఇంటలిజెన్స్ పైననే ఆధారపడినవని ,ఇది భవిష్యత్తు పరిశోధనా రంగంలో అనేక మార్పులకు కారణమవుతుందని తెలిపినారు. ఈ సదస్సు ద్వారా లైఫ్ సైన్స్ మరియు కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ రంగాలలో తాజా పరిశోధనలు మరియు అభివృద్ధులపై రాష్ట్రములోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన పరిశోధకులు వివిధ రాష్ట్రాల నుండి వచ్చినటువంటి పరిశోధకులు ఈ సదస్సులో తాము వివిధ రంగాలపై చేసిన పరిశోధనా పత్రాలను సమర్పించడం జరిగింది. ఈ రెండు రోజుల జాతీయ సదస్సుకు మంచి స్పందన రావడము పట్ల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందము ఈ సదస్సును నిర్వహించినటువంటి జీవశాస్త్ర మరియు కంప్యూటర్ విభాగాలు సంతృప్తిని వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో రాష్ట్రములోని వివిధ కళాశాలకు చెందిన అధ్యాపకులు ,రీసెర్చ్ స్కాలర్స్, వివిధ రాష్ట్రాల నుండి రీసెర్చ్ స్కాలర్స్, ఈ కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ నాగప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మిథున్ కుమార్ రాథోడ్, కళాశాల అధ్యాపక బృందము తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కాసర్ల నరేష్ రావుకు ధర్మనిధి పురస్కారం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 05 : తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద్ వారిచే అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించే "ధర్మ నిధి పురస్కారం " 2026 సంవత్సరానికి ఇందూరు కవి డాక్టర్ కాసర్ల నరేష్ రావుకి అందజేయనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి జే.చెన్నయ్య తెలిపారు. సాహిత్య రంగంలో విస్తృతమైన సేవలు నిరంతరం అందిస్తున్న వారికి ఈ పురస్కారాన్ని ప్రతిఏటా పరిషత్ వారు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా గత 30 సంవత్సరాలుగా ఇందూరు జిల్లా సాహిత్య రంగంలో నిత్య కవిగా, రచయితగా, వ్యాఖ్యాతగా, బాల సాహిత్యవేత్తగా రాణిస్తున్న కాసర్లను ఈ సంవత్సరం ఈ పురస్కారం వరించింది. ఈ పురస్కారం కింద రూ. 5 వేల లనగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, అందించి సత్కరించనున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 17 న హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్ లో అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఇతర సాహిత్య వేత్తలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాహిత్య ధర్మనిధి పురస్కారాన్ని అందుకోబోతున్న కవి కాసర్ల నరేష్ ను ఇందూరు జిల్లా కవులు వి.పి.చందన రావు పంచ రెడ్డి లక్ష్మణ్, తల్లా వజ్జల మహేష్ బాబు, డా. గణపతి అశోక శర్మ, డాక్టర్ తంగుడిగె ఫణీంద్ర, వారె దస్తగిరి, ప్రవీణ్ కుమార్ శర్మ, నాగుల రాజేందర్, అష్ట గంగాధర్ తదితరులు అభినందించారు.



రాబోయే జడ్పీ ఎన్నికలను కొత్త జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది. పంచాయతీల పునర్విభజనకూ న్యాయపరమైన అడ్డంకులు లేవు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసే, నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ వేసి సంరక్షించేలా వ్యవస్థను తీసుకువస్తాం. బెంగళూరు నర్సరీల్లో అమలు చేస్తున్న అత్యాధునిక విధానాలను పరిశీలిస్తున్నాం.
- అసెంబ్లీలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్

ప్రాంతీయం

ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 05 : నిజామాబాద్ జిల్లా కేంద్రం ఓల్డ్ గవర్నమెంట్ హాస్పిటల్ ఎదుట ఆర్ఎస్ బ్రదర్స్ సరికొత్త షోరూమ్ ను గురువారం ప్రఖ్యాత నటి నిధి అగర్వాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత నటి నిధి అగర్వాల్ కొత్త కాంతులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నిజామాబాద్ లో ఆర్ఎస్ కుటుంబంలో మమేకం కావడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ఉన్న కలెక్షన్లు అద్భుతంగా ఉన్నాయని, వివాహాది శుభకార్యాలు మొదలుకుని, పర్వదినాల వరకు ప్రతీ వేడుకకూ అచ్చంగా సరిపోయే వెరైటీలు ఆర్.ఎస్. బ్రదర్స్ నిజామాబాద్ షోరూమ్ లో మీకోసం సిద్ధంగా ఉన్నాయి" అన్నారు. నిజామాబాద్ లో సరికొత్త షోరూమ్ను ప్రారంభించడం ద్వారా ఆర్.ఎస్. బ్రదర్స్ మరో మైలురాయిని సగర్వంగా చేరుకుందన్నారు. సౌత్ ఇండియాలో ఆర్.ఎస్. బ్రదర్స్ బ్రాండ్ తన పేరు ప్రఖ్యాతల్ని విస్తరించి, కుటుంబ షాపింగ్ అవసరాలను తీర్చే విశ్వసనీయ సంస్థ అన్నారు. దార్శనికులైన పి వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి ప్రసాదరావు, దిగంగత పి సత్యనారాయణ నెలకొల్పిన ఆర్.ఎస్.బ్రదర్స్ సంప్రదాయాన్ని, ఆధునిక జీవనశైలిని మేళవించిన ఒక సుప్రసిద్ధ బ్రాండ్గా రూపు సంతరించుకొని వైవిధ్యంలో, నాణ్యతలో, విశ్వసనీయతలో, అందుబాటు ధరలలో కుటుంబంలోని అన్నితరాల వారినీ ఆకర్షిస్తూ, అలరిస్తోందన్నారు. ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్లు నిజామాబాద్ లో ఈ సరికొత్త షోరూమ్ శుభారంభ కార్యక్రమాన్ని కనులవిందుగా నిర్వహించడం తమకు గర్వకారణం అన్నారు. వివిధ తరాలకు, వయసులకు, వర్గాలకు చెందిన కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా అనేక రకాల వెరైటీలను అందించడం తమకు అనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్, హోల్ టైండైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "ప్రతీ సరికొత్త షోరూమ్ తో పాటు పర్వదినాలకు, వివాహ వేడుకలకు కొత్త వెరైటీలను కస్టమర్ల హృదయాలకు చేరువగా తీసుకురావడం మాకు గర్వకారణం" అన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ సీర్ణ రాజమౌళి ప్రసంగిస్తూ "దేశవ్యాప్తంగా ఉన్న ఫ్యాషన్లను సేకరించి మా నిజామాబాద్ కస్టమర్లకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హోల్టైం డైరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు పాల్గొన్నారు.

సెక్స్ వృత్తి భవిష్యత్ తరాలకు పునరావృతం కారాదు

- సీపీ సాయి చైతన్య

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 05 : తప్పని పరిస్థితుల్లో ఎంచుకున్న సెక్స్ వృత్తిని ఈ తరంతో వదిలి భవిష్యత్ తరాలకు పునరావృతం కాకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిజామాబాద్ జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. సాయి చైతన్య అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్ వాడి లో స్నేహ సొసైటీ పర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ వారి టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య జిల్లా సంక్షేమ అధికారి డి పద్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ తప్పని పరిస్థితుల్లో ఈ వృత్తిని ఎంచుకోనీ తమ కుటుంబాన్ని పోషించుకోవడం జరుగుతుందని తెలిపారు. కానీ ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం పూర్తిగా కొనసాగించరాదని సూచించారు. ఈ వృత్తి మీ తరం వరకే ఆగిపోవాలని తెలిపారు. తమ పిల్లలు కూడా ఈ వృత్తిని ఎంచుకొని వారి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోకుండా చూసే బాధ్యత తల్లిదండ్రులుగా మీపై ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అలాగే సెక్స్ వర్కర్లకు ప్రత్యేకమైన హక్కులు ఉన్నాయన్నారు. మీ హక్కుల కోసం పోలీస్ శాఖ , షీ టీమ్ , భరోసా సెంటర్ అందుబాటులో ఉందని తెలిపారు.. తమ వద్దకు వచ్చే వారు డ్రగ్స్ గంజాయి ఇతరత్రా మత్తు పదార్థాలు వాడి రావడం జరుగుతుందని అటువంటి సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే కొంతమంది తమ వద్దకు వచ్చే వారి పట్ల దౌర్జన్యాలకి హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పాల్పడుతూ ఉండడం జరుగుతుందని అలాంటి దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్నేహ టీ ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ సిద్దయ్య , జిల్లా వయోజన విద్య సహాయ సంచాలకులు ఏ పురుషోత్తం మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఏ. వికాస్, డిపిఎం సుధాకర్, సిపిఓ మొయిజ్ అహ్మద్ ,సఖి సెంటర్ అడ్మినిస్ట్రేషన్ భానుప్రియ, స్నేహ సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యులు ,తాటి వీరేశం గుప్తా, ప్రాజెక్ట్ ఆఫీసర్ వయోజన విద్య వెంకటేశ్వరరావు తదితరులు స్నేహ టి ఐ ప్రాజెక్ట్ మేనేజర్ శివ మరియు ఎస్ ఎస్ కె మేనేజర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో హనుమకొండ కలెక్టర్ పర్యటన

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 5 : హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని తహసీల్దార్ , ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి అధికారులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రికార్డు రూమును పరిశీలించి భూ భారతి దరఖాస్తులు సాదా బైనామా కేసుల వివరాలను తహసీల్దార్ విక్రమ్ కుమార్ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు అనంతరం సమీపంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) అమలుపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఉపాధి పనులు, సిబ్బంది పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు మండల ఎంపీడీవో కార్యాలయానికి అదనపు గదుల నిర్మాణం అవసరమని ఎంపీడీవో నర్మద కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే అందుకు సంబంధించిన అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు ఈ తనిఖీ సందర్భంగా ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 05 : హాలీడే ప్యాకేజీ ఫేక్ కస్టమర్ సర్వీస్ సెల్ టవర్ ఏర్పాటు హోటల్ బుకింగ్ పేరుతో అనుచిత ఫోన్ కాల్స్ చేస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ప్రవేశ పరిశ్రమ లో బొల్లారం పోలీసులు కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బొల్లారం ఎస్.ఐ కిష్టారెడ్డి , సైబర్ క్రైమ్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం లో కార్మికులకు పలు సూచనలు చేశారు. ప్రతీ వారం నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని పోలీసులు తెలిపారు .

ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 5 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమం లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా గృహప్రవేశాలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేసి లబ్దిదారులకు త్వరితగతిన గృహప్రవేశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం పేదల గృహ స్వప్నాన్ని నెరవేర్చడానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పనులను నాణ్యతతో పాటు నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని ఆయన తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు అవసరమైన సామగ్రి, సాంకేతిక సహాయం, ఇతర మౌలిక వసతులు సమయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో పనుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంలో చురుకుగా పాల్గొనేలా అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన ఇళ్లకు వెంటనే గృహప్రవేశాలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ , జిల్లా పరిషత్ సీఈవో, RDO వీణ, రంగ వెంకటేశ్వర్ గౌడ్ జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ స్కూల్ కి సంబంధించిన ఆన్లైన్ రిజిస్ట్రేషన్ తేదీని ఈ నెల 12.03.2026 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

మహిళలకు ఆటల పోటీలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 05 : ఈ నెలా 8 న (ఆదివారం) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ యువజన మంత్రిత్వ శాఖ, ఖేలో ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, మేరా యువ భారత్ నిజామాబాద్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా శాఖ సహకారంతో మహిళలకు వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ నిజామాబాద్ కేంద్ర జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ తెలిపారు. 13 సంవత్సరాల లోపు బాలికలకు, 13 నుంచి 18 సంవత్సరాల లోపు గల యువతులకు, 18 సంవత్సరాలు ఆపై వయసు గల మహిళలకు మూడు కేటగిరీలుగా విభజించి రన్నింగ్ పోటీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలో 100, 200, 400 మీటర్లుగా పరుగు పందెం పోటీలు ఉంటాయన్నారు. ఇవేకాకుండా మరికొన్ని ఆహ్లాదకరమైన ఆటలను మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించనున్నామని, ఈ పోటీలలో విజేతలకు మెడల్స్ బహూకరించడం జరుగుతుందన్నారు. నిజామాబాద్ జిల్లా పరిధిలోని మహిళలందరూ ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులే, కావున పెద్ద సంఖ్యలో మహిళలు ఈ పోటీలలో పాల్గొని అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పోటీలు మార్చి 8 ఉదయం 8 గంటలకు పాత కలెక్టర్ గ్రౌండ్స్ లో ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు సంస్థల మహిళా ఉద్యోగులు, విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో ఈ పోటీలలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు.

కార్మికుల సంక్షేమం కోసం కొత్త పాలసీ

- ఉద్యోగులు కూడా స్థానికులే ఇవ్వాలి
- ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేస్తాం
- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 05 : ప్రైవేట్ కార్మికుల సంక్షేమం కోసం స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి కొత్త పాలసీని తీసుకువస్తామని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. కార్మికులకు ప్రమాదం సంభవించి చనిపోతే, ఆ బాధిత కుటుంబానికి నేరుగా ఇన్సూరెన్స్ పరిహారం అందే ఏర్పాటు చేస్తామన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం లో సీఎస్ఆర్ నిధులతో న్యూలాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 57 లక్షల వ్యయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాల ప్రారంభోత్సవం కార్యక్రమం లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు కూడా స్థానికులే ఇవ్వాలన్నారు. వారికి తగ్గ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాన్ని త్వరలో సీఎం, మంత్రి కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ పాలసీ తో రాష్టంలోనే పటాన్ చెరు నియోజకవర్గం మోడల్ గా నిలుస్తుందన్నారు. 'మినీ ఇండియా పేరుపొందిన పటాన్ చెరు నియోజకవర్గంలో సీఎస్ఆర్ నిధులతో గొప్పగా అభివృద్ధి జరుగుతుంది. ఇవాళ సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేయడం అభినందనీయం. ఇండస్ట్రీస్ ఒకపక్క పర్యావరణ హితం కోసం పాటుపడుతూనే, మరోపక్క ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలి. విద్యార్థి దశలో ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంతా మంచిది. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నా వంతు సహకారం ఎప్పటికి ఉంటుంది.' అని అంజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ , వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కెనాల్‌లో కారు బోల్తా.. ఇద్దరు మృతి

- ఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చ్ 05 : నిజామాబాద్ నగర శివారు బైపాస్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున కారు అజాగ్రత్తగా నడిపి, పల్టీ కొట్టిన సంఘటన స్థలాన్ని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. కామారెడ్డి జిల్లా దోమకొండ ప్రాంతానికి చెందినటువంటి చింతల శ్రీనివాస్ ఇటుకల బట్టి వ్యాపారస్తుల వద్ద పని చేస్తున్నారు. కార్మికులు నాందేడ్ కు ఫ్యామిలీ విషయం మాట్లాడడం కోసం వెళ్లి తిరిగి ప్రయాణం అవుతున్న సందర్భంలో గురువారం తెల్లవారుజామున నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు ప్రాంతంలో గల మారుతి ఈకో టి.ఎస్ 17 కె 0762 గల వాహనమును కారు డ్రైవర్ అతివేగముగా అజాగ్రత్తగా నడపడం వలన కెనాల్ పై నుంచి క్రిందపడి మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించ గా, నలుగురికి తీవ్ర గాయాలు కావటంతో వారిని చికిత్స కొరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా ఇద్దరు మామూలు గాయాలతో బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పీ సాయి చైతన్య పర్యవేక్షించి, పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా సంఘటనకు సంబంధించినటువంటి పూర్తి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కారు డ్రైవర్ అతివేగముగా అజాగ్రత్తగా నడపడం వలన ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని , ముఖ్యంగా బైపాస్ రోడ్డులో అతివేగముగా వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా డిచ్పల్లి ఎస్సై ఎండి ఆరిఫ్ , నిజామాబాద్ రూరల్ ఎస్హెచ్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్వాడీలు, హాస్టళ్లలో పౌష్టికాహారం

నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరం

– ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 5: పేద పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల ద్వారా అందించే ఆహారం నాణ్యంగా ఉండేలా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. సిద్దిపేట జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. ప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం-2013ను పగడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 26 మండలాల్లో ఉన్న 686 చౌకధరల దుకాణాల పరిధిలో 3,33,332 ఆహార భద్రత కార్డుల ద్వారా 10,37,262 మంది లబ్ధిదారులకు ప్రతి నెల 6,583 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. ఈ వసతులు అర్హులైన వారికి సక్రమంగా అందేలా అధికారులు శాతం పర్యవేక్షణ చేయాలని సూచించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తానని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టళ్లలో వంట సరుకులు బయటకు వెళ్లకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమిస్తామని తెలిపారు. అలాగే సిద్దిపేట, గజ్వేల్‌లో ఎస్సీ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో వ్యాపారాల్లో తూనికలు, కొలతల్లో మోసాలు జరగకుండా తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ గోపికృష్ణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ , తూనికలు మరియు కొలతల అధికారి శివరంజని, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి శారదతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంగాధర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 05 : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని డిచ్పల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్ గత కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పలకరించి, సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



డబ్బులు ఉన్న వారు ఎందుకు తక్కువ మంది పిల్లలను కంటున్నారు. ఇప్పటికీ పేదవారే ఎక్కువ మంది పిల్లలను కంటున్నారు. అందుకే తల్లికి వందనం పథకం అందరికీ ఇచ్చాం. సరైన సమయంలో పెళ్లిళ్లు జరగాలి. ఈ రోజుల్లో విడాకులు కూడా ఎక్కువ అయిపోయాయి. భార్యాభర్తలకు సహనం లేకుండా పోయింది. సామాజిక సమస్యలపై మనం మాట్లాడితేనే ప్రజల్లో అవగాహన పెరుగుతుంది.

- అసెంబ్లీలో ఏపీ సీఎం చంద్రబాబు

యుద్ధాలకు ముగింపు పలకాలి: మోదీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 5: ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయని, సైనిక చర్యలకన్నా చర్చలు, రాజనీతే శాశ్వత పరిష్కారమని అన్నారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో గురువారం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దశలో ఉంది. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. చట్టపరమైన వ్యవస్థ, సంభాషణ, రాజనీతిపై భారత్, ఫిన్లాండ్ నమ్మకం ఉంచుతున్నాయి" అని తెలిపారు. ఏ సమస్యకూ సైనిక ఘర్షణలతో పరిష్కారం రాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధమైనా, పశ్చిమాసియా సంక్షోభమైనా వీలైనంత త్వరగా ముగియాలని, శాంతి నెలకొల్పే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ తెలిపారు. డిజిటలైజేషన్, సస్టైనబిలిటీ రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక మార్పిడి పెరగడానికి తాజా ఒప్పందాలు దోహదపడతాయని ప్రధాని పేర్కొన్నారు. ఫిన్లాండ్ కంపెనీలు భారత అభివృద్ధిలో ఇప్పటికే కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. అసోంలోని నుమాలిగఢ్‌లో బాంబూ నుంచి బయోఎథనాల్ తయారు చేసే అతిపెద్ద రిఫైనరీని కూడా రెండు దేశాల భాగస్వామ్యంతో నిర్మించామని తెలిపారు. ఇవి గ్రీన్ టెక్నాలజీ రంగంలో సహకారానికి నిదర్శనాలని చెప్పారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యవస్థ మార్పు దశలో ఉందని, గ్లోబల్ సౌత్ దేశాలు భవిష్యత్ దిశను నిర్ణయిస్తాయని తెలిపారు. భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలంటూ బహిరంగ మద్దతు ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌కు స్థానం అత్యంత అవసరమని అన్నారు.

విశ్వ వీక్షణం

మన పొరుగున ఉద్రిక్తతలు అయినా మౌనమెందుకు?

- ప్రధాని మోడీపై రాహుల్ గాంధీ విమర్శలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 5: పశ్చిమాసియా సైనిక ఘర్షణ చివరకు భారత్ పొరుగుదేశం దాకా చేరుకుందని, అయినా ప్రధాని మోదీ మౌనంగా ఉండటాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. శ్రీలంక సమీపంలోని హిందూ మహాసముద్రంలో ఇరాన్‌కు చెందిన ఐఆర్ఐఎస్ దేనా యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి ముంచేసినా మోదీ మాట్లాడకపోవడం సరికాదన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ట్వీట్ చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మన దేశం తరఫున ధైర్యంగా నిలువగలిగే, మాట్లాడగలిగే నాయకుడు కావాలని రాహుల్ పేర్కొన్నారు. కానీ భారతదేశ వ్యూహాత్మక స్వతంత్రతను ప్రధాని మోదీ ఇతర దేశాలకు సరెండర్ చేసి రాజీకి వచ్చారని మండిపడ్డారు. ఇరాన్ నౌకను అమెరికా ముంచేసిన అంశంపై ఇప్పటిదాకా భారత ప్రధాని ఒక్కమాట కూడా మాట్లాడలేదన్నారు. గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న సైనిక ఘర్షణ వల్ల భారత్‌కు జరిగే ముడి చమురు సప్లైలకూ ముప్పు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. భారత్ వినియోగించే ముడి చమురులో 40 శాతానికిపైగా ఇరాన్‌కు చెందిన హోర్ముజ్ జలసంధి మీదుగానే వస్తుంటుందని గుర్తుచేశారు. ఈ పరిణామాలు ముడి చమురు, సహజ వాయువు విభాగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని రాహుల్ హెచ్చరించారు. ప్రస్తుతం యావత్ ప్రపంచం అనిశ్చితిలో ఉందని, రాబోయేది కష్టకాలమని ఆయన వ్యాఖ్యానించారు.

నీ పక్కింటి రమేష్ చూడు ఎంత బాగా చదివాడో! వాడు అమెరికాలో సెటిల్ అయ్యాడు. నువ్వు మాత్రం ఏమయ్యావో చెప్పు? ఈ మాటలు మీకు కొత్తగా ఏమీ అనిపించవు కదా? బహుశా ఈ వాక్యం విన్న వెంటనే మీ గుండె లోతుల్లో ఎక్కడో ఒక చిన్నపాటి భారం, మరికొంత అసహనం, ఇంకొంత ఆవేదన ముసురుకుని ఉండవచ్చు. చిన్నప్పుడు స్కూల్ రిపోర్ట్ కార్డ్ పట్టుకుని ఇంటికి వచ్చినప్పటి నుండి, ఈ రోజు ఆఫీసులో ప్రమోషన్ రాక డీలా పడిపోయిన సమయం వరకు మనల్ని వెన్నాడుతున్న అతిపెద్ద శాపం పోలిక. తల్లిదండ్రుల నోట, ఉపాధ్యాయుల హెచ్చరికల్లో, బంధువుల వెటకారపు చూపుల్లో ఇలాంటి పోలికలు మనం ఎన్నిసార్లు విన్నాం? ఒక్కసారి గతాన్ని నెమరువేసుకుంటే, ఆ గాయాలు ఎంత లోతైనవో అర్థమవుతుంది.

పోలిక వద్దు.. నీ ప్రయాణం నీదే!

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

పోలిక అనేది మన సమాజంలో ఒక అంటువ్యాధిలా మారిపోయింది. ఒక వ్యక్తిని మరో వ్యక్తితో తూకం వేయడం, ఒకరి విజయాన్ని మరొకరి అపజయానికి కొలమానంగా మార్చడం మన తెలుగు సంస్కృతిలో నిత్యకృత్యమైపోయింది. కానీ, ప్రేమ అనే ముసుగులో మనం చేస్తున్న ఈ నిర్దోషమైన చర్య వెనుక ఎంతటి మానసిక విధ్వంసం దాగి ఉందో మనం ఎప్పుడైనా గుర్తించామా? ఏ తల్లిదండ్రులూ తమ బిడ్డకు చెడు జరగాలని కోరుకోరు. వారి లక్ష్యం ఎప్పుడూ ఉన్నతమైనదే పిల్లలను ఉత్తేజపరచాలి, వారిని పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలి. నీ అక్క చూడు ఎంత క్రమశిక్షణగా ఉంటుందో! నువ్వు కూడా అలా ఉండాలి అని అమ్మ అన్నప్పుడు, ఆమె ఉద్దేశం బిడ్డ బాగుపడాలనే. కానీ ఆ సున్నితమైన మనసుకు అది ఎలా చేరుతుందో తెలుసా? నేను తక్కువ వాడిని. నేను సరిపోను. నేను మా అమ్మ ప్రేమకు అర్హుడిని కాను అనే ఓ ప్రమాదకరమైన సందేశంగా అది మారుతుంది. ఇది అతిశయోక్తి అనిపించవచ్చు, కానీ మానసిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నిజం ఇదే. నిరంతర పోలికలకు గురయ్యే పిల్లల్లో ఆత్మవిశ్వాసం మంచులా కరిగిపోతుంది. వారు తమను తాము విలువ లేని వస్తువు గా భావించడం మొదలుపెడతారు. ఆ చిన్నతనంలో నాటుకున్న అభద్రతాభావం, వారు పెద్దయ్యాక కూడా నీడలా వెంటాడుతూనే ఉంటుంది. విజయం సాధించినా సరే, నేను ఇంకా ఎవరికంటేనో తక్కువగా ఉన్నాను అనే అసంతృప్తి వారిని ప్రశాంతంగా ఉండనివ్వదు. ఒకప్పుడు పోలికలు నాలుగు గోడల మధ్యో, లేదా వీధి అరుగు మీదో ముగిసిపోయేవి. కానీ ఇప్పుడు? ఇంటర్నెట్ పుణ్యమా అని ఆ రాక్షసి మన బెడ్ రూమ్ లోకి, మన అరచేతిలోకి చేరిపోయింది. ఇన్స్టాగ్రామ్ తెరిస్తే చాలు ఎవరో విదేశాల్లో విలాసవంతంగా విహరిస్తున్నారు, ఇంకెవరో జిమ్ లో కష్టపడి అద్భుతమైన శరీరాకృతిని సాధించారు, మరొకరు కొత్త కారు కొన్నారు. ఫేస్బుక్ లో చూస్తే అందరూ హ్యాపీగా నవ్వుతూ ఫోజులిస్తున్నారు. కానీ ఆ ఫిల్టర్ చేసిన ఫోటోల వెనుక ఉన్న నిజాన్ని మనం గమనిస్తున్నామా? ఇన్స్టాగ్రామ్ లో మెరుస్తున్న ఆ చిరునవ్వు వెనుక ఉన్న అప్పులు, ఒంటరితనం, మానసిక సంఘర్షణలు ఎవరూ పోస్ట్ చేయరు. మనం చూసేది కేవలం ఇతరుల జీవితాల్లోని హైలైట్ రీల్ మాత్రమే. మన కష్టాలతో నిండిన నిజ జీవితాన్ని వారి షోకాజ్ రీల్ తో పోల్చుకోవడం ఎంతవరకు న్యాయం? ఒక ఇరవై ఏళ్ళ యువతి, ఇంట్లో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ, తన క్లాస్మేట్ విదేశాల్లో పార్టీ చేసుకుంటున్న ఫోటో చూసి కుంగిపోవడం నేటి సమాజంలో అతిపెద్ద విషాదం. ఈ డిజిటల్ పోలికలు మన ఆత్మగౌరవాన్ని రాత్రికి రాత్రే నేలమట్టం చేస్తున్నాయి. మన తెలుగు కుటుంబాల్లో మంచి జీవితం అంటే దానికి ఒక పక్కా ఫార్ములా ఉంది. టెన్త్ లో పదికి పది పాయింట్లు, ఇంటర్ లో ఎంసెట్ ర్యాంకు, ఆపై ఐటీ ఉద్యోగం, అమెరికా సంబంధం ఈ గీత దాటి ఆలోచించే వారికి ఇక్కడ చోటు తక్కువ. ఎవరైనా ఈ మూసలో ఇమిడిపోయి సక్సెస్ అయ్యారంటే, ఇక చుట్టుపక్కల వారందరికీ అతనే బంగారు కొండ . ఫలానా వాళ్ళ అబ్బాయి సాఫ్ట్వేర్ లక్షలు సంపాదిస్తున్నాడు నువ్వు ఇంకా ఇక్కడే ఏం చేస్తున్నావు? ఈ ప్రశ్న వినని తెలుగు యువకుడు ఉండడు. పెళ్ళిళ్ళలో, పేరంటాల్లో, బంధువుల కలయికల్లో జరిగే చర్చలన్నీ పోలికల చుట్టూనే తిరుగుతాయి. జీతం, ఇల్లు, భార్య/భర్త అందం, పిల్లల స్కూల్ ఫీజులు ఇలా ప్రతిదీ ఒకరితో ఒకరు పోల్చుకుని, ఎవరు గొప్పో తేల్చుకునే పనిలో పడి అసలైన మనుషులని మర్చిపోతున్నాం. కృష్ణ (పేరు మార్చబడింది) ఒక సాధారణ మధ్యతరగతి యువకుడు. అతను ఇంజనీరింగ్ చదివాడు కానీ అతని మనసంతా సంగీతం, సాహిత్యం మీద ఉండేది. కానీ అతని తండ్రికి మాత్రం తన మేనల్లుడు (కృష్ణ బావ) అంటేనే ఇష్టం. ఎందుకంటే అతను అమెరికాలో సెటిల్ అయ్యాడు. బావను చూడు వాడు తోపు, నువ్వు మాత్రం ఇక్కడే కునారిల్లుతున్నావు అనే మాటలు కృష్ణను లోలోపల కుంగదీశాయి. ఫలితంగా కృష్ణ తనలోని సృజనాత్మకతను చంపుకున్నాడు. ఆత్మవిశ్వాసం కోల్పోయి ఇంటర్వ్యూలకు వెళ్ళినప్పుడు కనీసం తన పేరు కూడా సరిగ్గా చెప్పలేకపోయేవాడు. నేను ఎందుకూ పనికిరాని వాడిని అనే భావన అతనిలో గట్టిగా నాటుకుపోయింది. ఇది ఒక్క కృష్ణ కథ మాత్రమే కాదు, పోలికల బాధితులైన లక్షలాది మంది యువతీ యువకుల వాస్తవిక చిత్రం. మానసిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, పోలికల వల్ల కలిగే నష్టాలు ఊహాతీతం. నేను ఎవరు? నాకు ఏం కావాలి? అనే దానికంటే నేను వారికంటే తక్కువ కాదని ఎలా నిరూపించుకోవాలి? అనే తాపత్రయంలోనే జీవితం గడిచిపోతుంది ఒక్క తప్పు చేస్తే మళ్ళీ పోలికలు మొదలవుతాయనే భయంతో, కొత్త పనులు చేయడానికి కూడా భయపడతారు. ఇది ఎదుగుదలను ఆపేస్తుంది. నేను ఎప్పటికీ ఎవరికీ సరిపోను అనే నమ్మకం మనసులో విషంలా మారి, మానసిక ప్రశాంతతను హరిస్తుంది. ముఖ్యంగా పరీక్షల సమయంలో, పక్కింటి పిల్లలతో పోలిస్తే తక్కువ మార్కులు వస్తాయేమో అనే భయం విద్యార్థులను ఆత్మహత్యల వరకు తీసుకెళ్తుంది. మనం ఒక చేదు సత్యాన్ని అంగీకరించాలి. పోలికలు చేసేది ఎవరో విలన్లు కాదు మనమే! ఒక తల్లిగా, తండ్రిగా, ఉపాధ్యాయుడిగా, మేనేజర్ మనం కూడా తెలియకుండానే ఇతరులతో పోలుస్తుంటాం. వాడు ఒక్కసారి చదివితే గుర్తు పెట్టుకుంటాడు, నీకు వంద సార్లు చెప్పాలి అనే చిన్న మాట కూడా ఎదుటివారి మనసులో ఒక పెద్ద గాయాన్ని మిగులుస్తుందని మనం గుర్తించాలి. ప్రతి వ్యక్తికీ ఒక ప్రత్యేకమైన ప్రయాణం ఉంటుంది. తాబేలు వేగాన్ని కుందేలుతో, చేప ఈతను పక్షి ఎగరడంతో పోల్చడం ఎంత మూర్ఖత్వమో ఒకరి బలాలను మరొకరి బలహీనతలతో పోల్చడం కూడా అంతే అశాస్త్రీయం. మానవ వ్యక్తిత్వం అనేది మార్కుల్లోనో, జీతపు అంకెల్లోనో కొలిచే వస్తువు కాదు. మనం కోల్పోయిన ఆత్మగౌరవాన్ని మళ్ళీ సంపాదించుకోవాలంటే ఏం చేయాలి? ఎవరైనా మిమ్మల్ని పోల్చినప్పుడు, అది వారి అజ్ఞానమని భావించండి. నా ప్రయాణం నాది, నా వేగం నాది అని మీకు మీరు చెప్పుకోండి. మీ బిడ్డను మరొకరితో పోల్చడం ఆపండి. నువ్వు ఎలా ఉన్నా మాకు wనువ్వే గొప్ప అనే ఆ ఒక్క మాట వారి జీవితాన్ని మారుస్తుంది. మీ పోటీ ఇతరులతో కాదు, మీ గతంతోనే ఉండాలి. నిన్నటి కంటే ఈరోజు నేను ఎంత మెరుగ్గా ఉన్నాను? అని ఆలోచించండి. సోషల్ మీడియాలోని రంగుల ప్రపంచాన్ని చూసి మోసపోకండి. ఫోన్ పక్కన పెట్టి, మీ చుట్టూ ఉన్న చిన్న చిన్న ఆనందాలను వెతకండి.

> ఈ ప్రపంచంలో మీలాంటి వ్యక్తి మరొకరు లేరు. మీ నవ్వు, మీ ఆలోచనలు, మీ కష్టాలు, మీ విజయాలు ఇవన్నీ పూర్తిగా మీవే. వేరే ఎవరితోనూ పోల్చడానికి వీలు లేని ఒక అద్భుతమైన మాస్టర్ పీస్ మీరు. మీ విలువ మీ బ్యాంకు బ్యాలెన్స్ లో లేదు, మీ హోదాలో లేదు అది మీ మనసులో ఉంది. సమాజం మారాలి, పెంచే పద్ధతులు మారాలి. కానీ అన్నింటికంటే ముందు, మనల్ని మనం ప్రేమించుకోవడం నేర్చుకోవాలి. ఇకపై ఎవరైనా మిమ్మల్ని పోల్చినప్పుడు, కుంగిపోకుండా ఒక వాగ్దానం చేయండి నా దారి నాది. నా లక్ష్యం నాది. నా జీవితం నాది. ఆ ఒక్క నమ్మకమే రేపటి విజేతగా మిమ్మల్ని నిలబెడుతుంది.

సుఖోయ్ యుద్ధ విమానం గల్లంతు

- గాలింపు చేపపట్టిన ఐఏఎఫ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూర్, న్యూఢిల్లీ, మార్చి 5: భారతీయ వైమానిక దళానికి చెందిన సుఖోయ్ ఎస్‌యూ 30ఎంకేఐ యుద్ధ విమానం గురువారం సాయంత్రం అస్సాంలో అదృశ్యమైంది. అస్సాంలోని జోర్హాట్ నుంచి బయల్దేరిన యుద్ధ విమానం రాత్రి 7.42 గంటల తర్వాత రాడార్ కాంటాక్ట్‌ని కోల్పోయింది. వెంటనే ఐఏఎఫ్ గాలింపు, సహాయక చర్యలను చేపట్టింది. కనిపించకుండా పోయిన ఫైటర్ జెట్ ఆచూకీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని ఐఏఎఫ్ ఎక్స్‌లో వెల్లడించింది. 2000 దశకం ప్రారంభంలో భారతీయ వైమానిక దళం అమ్ములపొదిలో చేరిన సుఖోయ్ ఎస్‌యూ 30ఎంకేఐ యుద్ధ విమానం వైమానిక దళానికి వెన్నెముకగా నిలుస్తున్నది. ఈ ట్విన్ ఇంజిన్, మల్టీరోల్ ఫైటర్ జెట్‌ని రష్యా అభివృద్ధి చేయగా, భారతీయ, ఫ్రెంచ్, ఇజ్రాయెలీ ఏవియోనిక్స్ ఆయుధ వ్యవస్థలు ఇందులో మిళితమై ఉన్నాయి.

రాజ్యసభకు నితీశ్ నామినేషన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 5: బిహార్ సీఎంగా సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్ ఇక పెద్దల సభకు వెళ్లనున్నారు. ఈ మేరకు రాజ్యసభ అభ్యర్థిగా గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు ఎన్డీఏ అభ్యర్థులు ఉపేంద్ర కుశ్వాహా, బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో త్వరలోనే నీతీశ్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. త్వరలో బిహార్‌లో ఏర్పడబోయే నూతన ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని నీతీశ్ కుమార్ అంతకుముందు ఎక్స్‌లో పోస్టు చేశారు. శాసనసభ, శాసనమండలితో పాటు పార్లమెంటు ఉభయ సభల్లోనూ సభ్యుడిగా ఉండాలనేది తన ఆకాంక్ష అని అందులో రాసుకొచ్చారు. అదేవిధంగా రెండు దశాబ్దాలుగా తనను నమ్మి మద్దతు తెలిపిన వారికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. వారి మద్దతు వల్లే త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రాజ్యసభ ఎంపీగా తన ప్రయాణాన్ని ప్రారంభించాలని, అయితే కొత్త బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా, బిహార్‌తో తన బంధం కొనసాగుతోందని చెప్పారు. అదేవిధంగా భవిష్యత్తులోనూ బిహార్ అభివృద్ధికి కృషి చేస్తానని నీతీశ్ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ రాజీనామా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్ కతా, మార్చి 5 : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని పశ్చిమ బెంగాల్ లోక్ భవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆయన రాజీనామాకు గల స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. సీవీ ఆనంద బోస్ రాజీనామాపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ఆయన రాజీనామా విషయం తెలిసి తాను షాకయ్యానని చెప్పారు. ''గవర్నర్ రాజీనామాకు గల కారణం ప్రస్తుతానికి నాకు కూడా తెలియదు. ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటే నాకేమీ ఆశ్చర్యం అనిపించడం లేదు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి నుంచి ఆయన మీద రాజకీయపరమైన ఒత్తిడి ఉండొచ్చు. కొత్త గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని నియమిస్తున్నట్లు కేంద్ర మంత్రి నుంచి సమాచారం అందింది. గవర్నర్ తొలగింపు, కొత్త గవర్నర్ నియామకంలో కేంద్ర మంత్రి నన్ను సంప్రదించలేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సహకార విధానానికి కేంద్రం తగిన గౌరవం, ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాల గౌరవాన్ని కాపాడాలి'' అని మమత వ్యాఖ్యానించారు.

ఇంటికెళ్లాలి...ఎప్పుడు పంపిస్తారు?

పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం వెస్టిండీస్ జట్టుపై పడింది. పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 మ్యాచ్‌లో భారత జట్టు చేతిలో ఓడిన విండీస్ బృందం ఇంకా కోల్‌కతాలోనే ఉండిపోయింది. యుద్ధం కారణంగా విమాన సర్వీసులు రద్దైన నేపథ్యంలో కరీబియన్ ఆటగాళ్లు స్వదేశం వెళ్లేందుకు పడిగాపులు కాస్తున్నారు. హెడ్‌కోచ్ డారెన్ సమీ అయితే.. తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో మార్చి 1 ఆదివారం సెమీస్ బెర్తు కోసం భారత్, వెస్టిండీస్ తలపడ్డాయి. కానీ, ఆ మ్యాచ్‌లో సంజూ శాంసన్ విధ్వంసంతో విండీస్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అమెరికా, ఇజ్రాయేల్ - ఇరాన్ యుద్ధం కారణంగా వారిని వెంటనే పంపించలేని పరిస్థితి. దాంతో.. ఆ రోజు నుంచి ఇప్పటివరకూ కరీబియన్ ఆటగాళ్లు కోల్‌కతాలోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆ జట్టు హెడ్‌కోచ్ డారెన్ సమీ ఎక్స్ పోస్ట్‌లో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. 'నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా. మమ్మల్ని ఎప్పుడు పంపిస్తారో చెప్పండి. మేము కోల్‌కతాలోనే ఉండి ఐదు రోజులైంది. ఈరోజు.. రేపు.. కాంటే వచ్చే వారం.. ఏదో ఒక రోజు పంపిస్తామని అయినా చెప్పండి' అని సమీ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. సమీ పోస్ట్‌లో వెస్టిండీస్ క్రికెట్ గానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలిగానీ ఇంకా స్పందించలేదు.

శాంసన్ మెరుపు బ్యాటింగ్

ఫైనల్ చేరిన భారత్

ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో ఇంగ్లండ్ కడదాకా పోరాడిన వాంఖడేలో విజయంతో మురిసింది. జాకబ్ బెథెల్(105) భయపెట్టినా.. బుమ్రా(331), పాండ్యా(238)లు డెత్ ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని పడగొట్టారు. మ్యాచ్ చేజారుతున్న వేళ బౌండరీ లైన్ వద్ద అక్షర్ పటేల్.. తిలక్ వర్మ పట్టిన క్యాచ్‌లు భారత విజయంలో కీలకమయ్యాయి. ఉత్కంఠ రేపిన రెండో సెమీఫైనల్లో భారత్ అద్భుత విజయం సాధించింది. వెస్టిండీస్‌ను ఓడించిన ఆత్మవిశ్వాసంతో వాంఖడేలో ఇంగ్లండ్ బౌలర్లను ఉతికేస్తూ 253 రన్స్ కొట్టిన టీమిండియా.. రికార్డు ఛేదనలో ప్రత్యర్థి గొప్పగా పోరాడినా 246కే కట్టడి చేసింది. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ ఫీల్డింగ్ మెరుపులు.. బుమ్రా, హార్దిక్ బౌలింగ్ టీమిండియాను గెలిపించాయి. 7 పరుగులతో విక్టరీ కొట్టిన టీమిండియా.. ఇంగ్లండ్‌పై వరుసగా రెండోసారి సెమీస్‌లో పైచేయి సాధించింది. చివరి ఓవర్లో 30 రన్స్ అవసరమవ్వగా.. దూబే బంతి అందుకున్నాడు. సెంచరీతో జోరుమీదున్న బెథెల్ క్రీజులో ఉండడంతో అందరిలో ఉత్కంఠ. కానీ, స్ట్రెయిట్‌గా ఆడిన బెథెల్ రెండు పరుగులు తీసే క్రమంలో రనౌటయ్యాడు. అంతే.. భారత ఆటగాళ్లు అభిమానులు సంబురాల్లో మునిగిపోయారు. వరుసగా మూడు బంతుల్ని జోఫ్రా ఆర్చర్(19 నాటౌట్) సిక్సర్లుగా మలిచాడు. 240 పరుగులకే పరిమితమైంది. వికెట్ల తేడాతో గెలుపొందిన భారత్ ఆదివారం న్యూజిలాండ్‌తో టైటిల్ పోరులో తలపడనుంది. భారీ ఛేదనలో రెండో ఓవర్లోనే హార్దిక్ పాండ్యా వికెట్ అందించాడు. ఫామ్‌లో లేని ఫిల్ సాల్ట్(5)ను ఔట్ చేసిన అతడు.. బుమ్రా ఓవర్లో హ్యారీ బ్రూక్(7) దొరికిపోయాడు. ఆ తర్వాత జాకబ్ బెథెల్(105) వరుణ్ చక్రవర్తి ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లు బాదాడు. సింగిల్ తీయడమే పొరపాటైంది. ఆ తర్వాతి బంతికే పెద్ద షాట్ ఆడాలనుకున్న బట్లర్‌ను గూగ్లీతో బౌల్డ్ చేసిన వరుణ్ మూడో వికెట్ అందించాడు. కాసేపటికే అక్షర్ పటేల్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాదిన టామ్ బ్యాంటన్(17).. స్లో బంతికి బౌల్డయ్యాడు. దాంతో.. 95కే నాలుగు వికెట్లు పడ్డాయి. ఆ దశలో విల్ జాక్స్(35) జతగా రెచ్చిపోయాడు. సిక్సర్ల మీద సిక్సర్లు బాదిన ఈ చిచ్చరపిడుగు.. అర్ధ శతకంతో ఆశలు రేపాడు. 14వ ఓవర్లో వరుసగా మూడు వైడ్లు వేసినా.. అక్షర్ పటేల్ స్టన్నింగ్ క్యాచ్‌తో.. ఈ జోడీని విడదీసి.. 27 బంతుల్లోనే 50 రన్స్ రాబట్టిన.. సామ్ కరన్(18)ను తిలక్ బౌండరీ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. అయినా.. క్రీజులో బెథెల్ ఉండడంతో ఇంగ్లండ్ విజయంపై ధీమాతో ఉంది. కానీ 18వ ఓవర్లో బుమ్రా ఆరు పరుగులు.. 19వ ఓవర్లో 9 రన్స్ ఇచ్చిన పాండ్యా వికెట్ తీశాడు. చివరి ఓవర్లో తొలి బంతికే బెథెల్ రనౌటవ్వగా.. భారత్ విజయం ఖాయమైంది. ఆఖరి మూడు బంతులకు ఆర్చర్(19 నాటౌట్) సిక్సర్లు సంధించగా.. ఇంగ్లండ్ 246కి పరిమితమైంది.

రెచ్చిపోయిన శాంసన్, దూబే

ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై చెలరేగిన సంజూ శాంసన్(89) ఇంగ్లండ్ బౌలర్ల భరతం పట్టగా.. మిడిలార్డర్లో శివం దూబే(43) ఉతికేశాడు. వరుసగా రెండో అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు సంజూ బాటలు వేయగా.. ఇషాన్ కిషన్(39) దూబే మెరుపులతో రాకెట్ వేగంతో పరుగులు వచ్చాయి. డెత్ ఓవర్లలో హార్దిక్ పాండ్యా(27), తిలక్ వర్మ(21)లు తమమార్క్ విధ్వంసంతో కదం తొక్కగా టీమిండియా 253 పరుగులతో ప్రత్యర్థికి కష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది.

వైభవంగా అర్జున్ టెండూల్కర్ వివాహం

భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్వివాహ బంధంలో అడుగుపెట్టాడు. ఆంత్రోప్రెన్యూర్ సానియా చందోక్‌ను పెళ్లి చేసుకున్నాడు. ముంబైలో వీరి కల్యాణ వేడుక ఆద్యంతం.. వైభవంగా జరిగింది. కొత్త జంటను ఆశీర్వదించేందుకు క్రీడా, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు భారీగా తరలి వెళ్లారు. నిరుడు ఆగస్టు 25వ తేదీన అర్జున్, సానియా చందోక్‌ల నిశ్చితార్థం జరిగింది. మార్చి ఆరంభంలోనే ముందస్తు పెళ్లి వేడుకల్లో సచిన్ దంపతులు, కుటుంబసభ్యులు సందడి చేశారు. సన్నిహితులు, బంధుమిత్రుల సమక్షంలో సౌత్ ముంబైలో అర్జున్, సానియాల పెళ్లి కన్నులపండువగా జరిగింది. కొత్త జంటను దీవించేందుకు మాజీ ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో వచ్చారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భార్య సాక్షితో పాటు హాజరయ్యారు. వెటరన్ ప్లేయర్ సునీల్ గవాస్కర్, మాజీ కోచ్‌లు రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, రవి శాస్త్రిలు సైతం కొత్త జంటను దీవించారు. టీమిండియా ప్రస్తుత కోచ్ గౌతం గంభీర్.. మాజీ హిట్టర్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ యూసుఫ్ పఠాన్‌లు సతీసమేతంగా విచ్చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఐసీసీ ఛైర్మన్ జై షా, కామెంటేటర్ హర్ష భోగ్లే.. తదితరులు కొత్త దంపతులైన అర్జున్ - సానియాకు అభినందనలు తెలిపారు.

ఏప్రిల్ 3న వస్తున్న 'బైకర్'

చార్మింగ్ స్టార్ శర్వా అడ్రెనలిన్ ఫిల్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బైకర్, భారతదేశంలోనే మొదటి మోటోక్రాస్ స్పెక్టాకిల్‌గా రూపొందుతోంది. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్నియూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. కుటుంబ భావోద్వేగాలతో కూడిన యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. మేకర్స్ ఇప్పుడు మరో ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రం డాల్బీ సినిమా, EPIQ, 4DX, PCX వంటి ప్రీమియం ఫార్మాట్లలో కూడా విడుదల కానుంది. దీంతో ప్రేక్షకులకు మరింత ఇమర్సివ్ థియేట్రికల్ అనుభూతి అందించనుంది. హార్ట్‌పౌండింగ్ రేసింగ్ సన్నివేశాలు, భావోద్వేగాలతో కూడిన కథతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. పోస్ట్ ప్రొడక్షన్ దశలో విజువల్స్, సౌండ్ డిజైన్, హైఆక్టేన్ యాక్షన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రతి బైక్ రోర్, ప్రతి ఎమోషనల్ సన్నివేశం థియేటర్‌లో మరింత ప్రభావం చూపేలా రూపొందించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ టీజర్లు సినిమాపై భారీ బజ్‌ను క్రియేట్ చేశాయి. ప్రీరిలీజ్ బిజినెస్ కూడా బలంగా ఉంది. ఈ చిత్రంలో శర్వానంద్ డేరింగ్ ప్రొఫెషనల్ మోటార్ సైకిల్ రేసర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సీనియర్ హీరో రాజశేఖర్ "బుల్లెట్ సునీల్" అనే ఎక్స్ మోటోక్రాస్ లెజెండ్ పాత్రలో కనిపించనున్నారు. హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీని జె. యువరాజ్ అందిస్తుండగా, సంగీతాన్ని జిబ్రాన్ సమకూరుస్తున్నారు. ఎడిటింగ్ అనిల్ కుమార్ పి నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను రాజీవన్ రూపొందిస్తున్నారు. భారీ యాక్షన్, ఎమోషన్స్, టాప్ టెక్నికల్ టీమ్‌తో రూపొందిన "బైకర్" ఈ సమ్మర్ సీజన్‌లో ప్రేక్షకులకు థ్రిల్లింగ్ థియేట్రికల్ అనుభూతిని అందించడానికి సిద్ధమవుతోంది.

వృషకర్మ నా కెరీర్లో బెస్ట్ మూవీ అవుతుంది

- **చివరి 30 నిమిషాల క్లైమాక్స్ ఇండియన్ సినిమాలో బెంచ్ మార్క్ సెట్ చేస్తుంది**
- **యువ సామ్రాట్ నాగ చైతన్య**

యువ సామ్రాట్ నాగ చైతన్య, 'విరూపాక్ష' ఫేం కార్తీక్ దండుతో కలిసి నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'తో డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ చిత్రాన్ని SVCC, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాపినీడు సమర్పిస్తున్నారు. బిహైండ్ ది సీన్ వీడియోలు, ఫస్ట్ లుక్ తో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ రోజు, మేకర్స్ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. గ్లింప్స్ ఒక భయానకమైన సన్నివేశంతో ప్రారంభమైయింది. ఒక దుష్ట శక్తి ప్రభావంలో ఉన్న వ్యక్తి ఒక చిత్రాన్ని గీయడం, ఒక్కసారిగా అతని లోపల నుంచి ఒక భయంకరమైన శక్తి గబ్బిలం రూపంలో బయటకు వచ్చి మరో వ్యక్తి తలలోకి దూసుకెళ్లి అతన్ని చంపేయడం వెన్నులో వణుకుపుట్టించేలా వుంది. 'అతీంద్రియ శక్తులు మేల్కొన్నప్పుడు, సృష్టి ధర్మం తప్పినప్పుడు, విధి ఒక వృషకర్మని ఎంచుకుంటుంది' అనే వాయిస్ కథపై మరింత ఆసక్తిని పెంచింది. వృషకర్మ దుష్టశక్తిని ఎదుర్కొనేందుకు ముందుకు అడుగు వేస్తూ గ్లింప్స్ పూర్తి కావడం అదిరిపోయింది. ఈ గ్లింప్స్ భారీ స్కేల్, అద్భుతమైన విజువల్స్, గ్రిప్పింగ్ ప్రెజెంటేషన్‌తో ఆకట్టుకుంటోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక భారీ సినిమాటిక్ యూనివర్స్‌ను నిర్మించాలనే మేకర్స్ విజన్ స్పష్టంగా కనిపిస్తోంది. నాగ చైతన్య రగ్గడ్, ఇంటెన్స్ అవతార్‌లో తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ ట్రాన్స్‌ఫర్మేషన్లలో కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, రా, ఫియర్స్ లుక్ గ్లింప్స్‌కు ప్రత్యేకంగా నిలుస్తోంది. దుష్ట శక్తులకు ఎదురొడ్డి నిలిచే యోధుడిలా ఆయన పాత్ర కనిపిస్తోంది. స్పర్శ్ శ్రీవాస్తవ పోషించిన భయంకరమైన విలన్ పాత్ర మరో హైలెట్. ఆయన టెర్రిఫిక్ ప్రెజెన్స్ కథలో ఇంటెన్స్ ఘర్షణకు సంకేతాలు ఇస్తోంది. అలాగే హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి, జయరామ్ పోషించిన పాత్రను గ్లింప్స్ లో కీలకంగా కనిపించాయి. దర్శకుడు కార్తిక్ దండు ఈ భారీ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా అన్నీ జాగ్రత్తలు తీసుకొని రూపొందిస్తున్నారు. సినిమాపై ఉన్న భారీ అంచనాలను అందుకునేలా ఒక ఇమర్సివ్ సినిమాటిక్ అనుభూతిని ఇవ్వనున్నారు. సినిమాటోగ్రాఫర్ రాహుల్ డి హెరియన్ అందించిన విజువల్స్ అద్భుతంగా కనిపిస్తుండగా, ప్రొడక్షన్ డిజైనర్ శ్రీ నాగేంద్ర తంగాలా నిర్మించిన ప్రపంచం రిచ్‌గా అనిపిస్తోంది. అజినీస్ లోక్ నాథ్ అందించిన పవర్‌ఫుల్, హాంటింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు మరింత ఇంపాక్ట్ తీసుకొచ్చింది. ఎడిటర్ నవీన్ నూలి చేసిన షార్ప్ కట్స్ కూడా ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. మొత్తంగా "వృషకర్మ" ఫస్ట్ గ్లింప్స్ ఒక టెర్రిఫిక్ సినిమాటిక్ అనుభూతిని అందిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో యువ సామ్రాట్ నాగ చైతన్య మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. వృషకర్మ గ్లింప్స్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. కార్తీక్ చెప్పినట్టు ఇది నా కెరీర్లో 100% బెస్ట్ మూవీ కాబోతుంది. స్క్రిప్ట్ విన్నప్పుడే అనిపించింది. ఇంత పెద్ద స్కేల్‌లో మిథికల్ థ్రిల్లర్ సినిమా చేయాలని ఎప్పటినుంచో ఉండింది. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. స్క్రిప్ట్ విన్నప్పుడే మైండ్ బ్లోయింగ్ అనిపించింది' అన్నారు.

మార్చి 26న 'బ్యాండ్ మేళం'

శ్రీరామనవమికి విడుదలకు సిద్ధం

'కోర్ట్' చిత్రంతో మెప్పించిన హర్ష్ రోషన్, శ్రీదేవీ జంట మళ్లీ 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్‌జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 26న రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు వదిలిన కంటెంట్ ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 'బ్యాండ్ మేళం' టీజర్, ట్రైలర్, మాస్ పెప్పీ సాంగ్ 'తిప్పు కుంటున్నావ్', మంచి మెలోడీ సాంగ్ 'పల్లెలోని సందల్లన్ని మీవే' వంటివి ఆడియెన్స్‌లో సినిమా పట్ల అంచనాల్ని పెంచేసింది. యూత్ ఆడియెన్స్‌లో ఇప్పటికే మంచి బజ్‌ను క్రియేట్ చేసుకున్న ఈ చిత్రం శ్రీరాముడి ఆశీస్సులతో శ్రీరామ నవమి సందర్భంగా రిలీజ్ కాబోతోంది. మార్చి 26న ఈ సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్లు ప్లాన్ చేశారు. ప్రమోషన్స్‌కి కావాల్సినంత టైం దొరకడంతో చిత్రయూనిట్ సైతం డిఫరెంట్ స్టైల్లో ఆడియెన్స్‌ను రీచ్ అయ్యేలా ప్లాన్ చేస్తోంది. త్వరలోనే ఇతర ప్రమోషనల్ కంటెంట్, ఈవెంట్లకు సంబంధించిన వివరాల్ని ప్రకటించనున్నారు. శివరాజు ప్రణవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. శివ ముప్పరాజు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే బాధ్యతల్ని నిర్వర్తించారు. సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫర్‌గా పని చేశారు. ఇక ఈ మూవీలో సాయికుమార్ కీలక పాత్రను పోషించారు. ఈ సినిమాను మార్చి 26న భారీ ఎత్తున విడుదల చేయబోతోన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200